ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు



సంపుటి : 11 | సంచిక : 7 | మార్చి 2006

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥100/-

విడి ప్రతి : రూ॥ 5/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

తణుకు ............. 27-11-05

హైదరాబాద్ ...... 30-12-05

జిన్నూరు............ 30-01-06

మల్కిపురం ........ 21-01-06

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, ☎ 08814 - 228858

# పాండిత్యం పరమావధి

పాండిత్యం పరమావధిని శంకరాచార్యులవారు ఇలా నిర్వచిస్తున్నారు. పాండిత్యం జీవుడి లక్ష్యాన్ని, దాన్ని సాధించే క్రమాన్ని నిర్ణయించాలి. అన్నింటిని సమదృష్టితో చూడటం అలవర్చుకోవాలి. నామరూపాలలో బేధమున్నప్పటికీ అందరూ సములేనన్న నిశ్చయం ఏర్పడాలి. ఉన్నది ఒక్కటే పరమసత్యం. దానిని గ్రహించటానికి విద్య సహకరించాలి. పాండిత్యం వ్యక్తిని సంస్కారవంతునిగా, వినయశీలుడిగా, వివేకవంతుడిగా విచక్షణ గలవానిగా తీర్చిదిద్దాలి. అంతేగాని అహంకార పూరితునిగా మార్చకూడదు. తనకన్నా తక్కువ అవగాహన, పాండిత్యం గల వారి పట్ల చిన్నచూపు తగదు. అలాగే తనకన్నా ఎక్కువ పాండిత్యం గలవారి పట్ల అసూయ పడకూడదు. తమ మనఃప్రవృత్తినిబట్టి తమ విద్యను, ధనాన్ని కొందరు సద్వినియోగపరిస్తే, మరికొందరు దుర్వినియోగ పరుస్తారు. ఉత్తములయినవారు జ్ఞానసముపార్జనకొరకు విద్యను, దాతృత్వానికి ధనాన్ని, పరోపకారానికి బలాన్ని వినియోగిస్తారు. అధములు తమ ప్రజ్ఞను వాదోపవాదాలకి, ధనాన్ని ఆర్భాటాలకి, బలాన్ని పరపీడనకు వినియోగిస్తారు. సజ్జనులతో సాంగత్యం నిస్సంగత్వాన్ని కలిగించి మోహంలో పడకుండా రక్షిస్తుంది. జీవన్ముక్తుడిని చేస్తుంది.

- బొప్పన అరుణాదేవి

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-11-05, తణుకు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇవి జ్ఞానయజ్ఞాలు. మీ చివరిశ్వాస వరకు యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెప్పాడు. ఒకవేళ మీకు ఆత్మజ్ఞానం కలిగినా మీకు అవసరం లేకపోయినా ఇతరుల కోసమైన యజ్ఞ దాన తపస్సులను ఆచరించమని భగవంతుడు చెప్పాడు. భగవంతుడు ఒక్కడు అంటే ఒక్కడే. ఆయన ఎప్పుడు శరీరం తీసుకోవాలో ఆయనే నిర్ణయించుకొంటాడు. రూపాలు తేడా, నామాలు తేడా గాని ఉన్న వస్తువు ఒక్కటే. సైన్సు అభివృద్ధి చెందినప్పటికీ మనం సుఖంగా లేము ఎందుచేతనంటే మనకు ధర్మాచరణ పట్ల గౌరవం లేదు, ముముక్షత్వం లేదు. శాంతి స్థానం ఎక్కడఉందో దాని తాలుక ఎరుకలేదు. అందరికీ సుఖపడాలని ఉంది కాని ఎలా సుఖపడాలో తెలియటం లేదు. మనకు భక్తి లేదు. గుడికివెళ్ళినంత మాత్రం చేతనే మనం భక్తులం అని చెప్పలేము. భగవదనుభవం పొందాలి అనే తపన మనకు హృదయంలోనుండి రావాలి, అది బయటనుండి వచ్చేది కాదు, అది బజారులో కొనుక్కొనేది కాదు, మనకు ఉన్న గౌరవాలవలన గాని ధనంవలన గాని అది రాదు, ఆ ఔన్నత్యం హృదయంలో నుండే రావాలి. గురునానక్ ఒక చక్కటిమాట చెప్పాడు. వేలాదికోట్లు ధనం ఉన్న వారికంటే, ఉన్నతోన్నతమైన పదవులు ఉన్నవారికంటే, గొప్ప పండితుల కంటే, పాపులారిటీ ఉన్న లీడర్స్ కంటే భగవంతుడియందు భక్తి, ప్రేమ కలిగిన ఒక చీమ మెరుగు అని చెప్పాడు.

ఇప్పుడు మన దగ్గర ఉన్న ధనం గాని, మనకు ఉన్న కంఫర్ట్సు గాని మన పూర్వీకులకు లేవు కాని వారు మనకంటే సుఖంగా, శాంతిగా ఉన్నారు. దానికి కారణం ఒక్కటే. అహంకారం, మమకారం మన పూర్వీకులకంటే మనకు ఎక్కువ అయిపోయినాయి. ఇవి ఎక్కువగా ఉండటం వలన మనం ధనవంతులం అయినప్పటికీ, కంఫర్ట్సు ఎక్కువగా ఉన్నప్పటికీ సుఖానికి, శాంతికి దూరమయిపోతున్నాము. వారికి ఉన్న నిగ్రహం మనకు లేదు. మన కళ్ళకు కనిపించే ఈ ప్రపంచం ఒక్కటే నిజం అనుకొంటున్నాము, అంతకంటే లోతులలోనికి వెళ్ళి ఆలోచించ లేకపోతున్నాము. ఇదే మన అశాంతికి కారణం. లోకానికి సంబంధించిన గౌరవాలు గాని, మెరుపులు గాని మీకు ఎన్ని ఉన్నా అవి అన్నీ నూటికి నూరుపాళ్ళు స్వప్నంతో సమానము. ఇది గ్రహించినవాడు ధన్యుడు. మీకు ధనం ఉన్నా, పాండిత్యం ఉన్నా, తెలివి

ఉన్నా అవి మీ సొంతం కాదు, ఇవన్నీ భగవంతుడు మీకు ఇచ్చాడు. నీకు ఈ శరీరం ఎటువంటిదో, భగవంతుడికి ఈ లోకం అటువంటిది. ఈ శరీరం నాది అని నీవు ఎలా అనుకొంటున్నావో, ఈ సృష్టి అంతా నాది అని భగవంతుడు అనుకొంటాడు. అందుచేత మీరు ఏమి చెయ్యాలి అంటే భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను భగవంతుడికి దేహంగా ఉన్న ఈ సృష్టికి ఉపయోగించండి. మన దేహయాత్రకు ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వచ్చేస్తుంది. మీకు వెయ్యికోట్ల డబ్బు ఉన్నా, మీరు ప్రతీ చిన్నవిషయానికి ఇతరుల మీద ఆధారపడితే ఈ భూమి మీద ఉండగానే నరకం అనుభవిస్తారు. మీకు డబ్బు ఎక్కువగా లేకపోయినా ఇతరుల మీద ఆధారపడకుండా జీవిస్తూ ఉంటే ఈ భూమి మీదే స్వర్గం అనుభవించవచ్చు. మన కాళ్ళమీద మనం జాగ్రత్తగా నిలబడి, మన అవసరాలు మనం చూసుకొంటూ, సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడుతూ ఉంటే ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. లోకం గొడవలలోనికి ఎక్కువగా వెళ్ళవద్దు. భగవంతుడు చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకోండి, భగవంతుడి పట్ల పరిపూర్ణమైన విశ్వాసం కలిగి ఉండండి. మన విశ్వాసమే మనలను ఒడ్డుకు తీసుకొని పోతుంది, జనన మరణచక్రం నుండి విడుదల పొందుతాము. భగవద్గీతలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం లేదు. గీతను అధ్యయనం చేస్తూ ఉంటే మీకు జీవితంలో వచ్చే సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. యజ్ఞ కర్మల వలన మీరు పవిత్రులవుతారు, అంతఃకరణశుద్ధి అవుతుంది. మనస్సు కూడా ఒకపనిముట్టే, అది లోపల ఉన్న పనిముట్టు. సబ్బుతో శరీరాన్ని శుభ్రం చేయవచ్చు. అలాగే లోపల ఉన్న పనిముట్టును శుభ్రం చేయాలంటే ఈశ్వరుని ప్రార్థించటం వలన, శరణాగతి వలన, యజ్ఞ కర్మలు ఆచరించటం వలన లోపల ఉన్న పనిముట్టును శుభ్రం చేయవచ్చు. మీ దేహాన్ని ఎలా జాగ్రత్తగా చూసుకొంటున్నారో, దానికి అనారోగ్యం వస్తే ఎలా వైద్యం చేయిస్తున్నారో అలాగ ఇంకో ఉపాధికి చేయగలిగితే అవి యజ్ఞకర్మలు అంటే. అంతేగాని ఎవరినో ఉద్ధరిస్తున్నాము అనే భావనలోనికి వెళితే రజోగుణం పెరిగిపోతుంది, మీరు పతనమయి పోతారు. వాక్కుమౌనం వలన మానవుడు మాధవుడు అవ్వలేడు. మానసికమౌనం వలన, యజ్ఞకర్మలు ఆచరించటం వలన, వివేకం వలన, వైరాగ్యం వలన మానవుడు మాధవుడు అవుతాడు.

మీ చేతిలో ఉన్న పనిని నార్మల్‌గా చేయండి, నేచురల్‌గా చేయండి, ఆర్టిఫిషియల్‌గా

చేయవద్దు. గతించిపోయిన గొడవలు తలపెట్టుకోవద్దు. జీవితంలో మీకు ఇష్టంలేని సంఘటనలు జరుగుతూ ఉంటే మీరు కంగారుపడకండి. ఆ ఇష్టంలేని సంఘటనలు భవిష్యత్తులో మీ అభివృద్ధికి పునాది అవ్వవచ్చు. మనకు ఏది మంచిదో, ఏది ఉపకారం చేస్తుందో మనకంటే మనలో అంతర్యామిగా ఉన్న నారాయణుడికి బాగా తెలుసు. ఆయన సర్వశక్తిమంతుడు. మనం పనిచేసేటప్పుడు ఆసక్తి పెట్టుకోకూడదు. పని వలన అలసట రాదు, ఆసక్తి పెట్టుకోవటం వలన ఎక్కువ అలసట వచ్చేస్తుంది. ఈ లోకంలో స్వతంత్రుడు ఈశ్వరుడు ఒక్కడే. ఏ జీవుడు స్వతంత్రుడు కాదు. ఆయన ఎక్కడ కూర్చోమంటే మనం అక్కడ కూర్చోవలసిందే. మనం సుఖం కోసం బజారులో వెతుక్కొంటున్నాము. ఇలా లక్షలాది జన్మలు వెతికినా మనకు సుఖం దొరకదు. ఎందుచేతనంటే సుఖం బయట లేదు. సుఖం మన హృదయంలోనే ఉంది. మన మనస్సును అంతర్ముఖపరిస్తే అది మనకు అనుభవంలోనికి వస్తుంది. మనం పొందవలసింది మన హృదయంలోనే ఉంది, బయట ఏమీ లేదు, బయట ఏదో ఉంది అని నీకు అనిపిస్తోంది, అదే భ్రాంతి, అదే మాయ. ఈ భ్రాంతిలో నుండి, మాయలో నుండి బయటపడటానికే ముకుందుడిని ఆరాధించు అంటున్నారు ఆచార్యులవారు. అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి, బంధంలోనుండి ఎవడైతే మనలను విడుదలచేస్తాడో వాడే ముకుందుడు, వాడిని ఆశ్రయించు. భగవంతుడిని మనం ఏది అడిగితే అది ఇస్తాడు, మనం ఏది అడకుండా ఉంటే మనకు ఏది మంచిదో అది ఇస్తాడు. గురువుపట్ల, ఈశ్వరునిపట్ల కృతజ్ఞత లేనివాడికి ఎంత సాధన చేసినా జ్ఞానం వాడిని వరించదు అని శాస్త్రంలో చెప్పారు.

కొంతమందికి భక్తి అంటే ఎంత ఇష్టం ఉంటుంది అంటే మాకు ముక్తి వద్దు అంటారు. మీ అమ్మాయిని మీరు ఎంతో శ్రద్ధగా పెంచుతారు, చదువు చెప్పిస్తారు, బంగారం కొనిపెడతారు, ఎంతో జాగ్రత్తగా సెలెక్టు చేసి పెళ్ళి చేస్తారు, ఇవి అన్నీ ఆ అమ్మాయి చేయమందా? ఇది అంతా మీ గోలే. చివరకు పెళ్ళి చేసి అత్తవారింటికి పంపేటప్పుడు ఏడుస్తారు. ఇంతకీ ఆ అమ్మాయి ఈ ఇంట్లో నుండి ఇంకో ఇంటికి వెళుతోంది అంతే. అలాగే మనం ఏ రూపాన్ని ఆరాధించినా, ఏ నామాన్ని స్మరించినా ఈ నామరూపములను విడిచిపెట్టి పరమస్థితిలో ఐక్యమయ్యేటప్పుడు ఎంతోకొంత దుఃఖం రావచ్చు అని పరమాచార్య ఒకసారి అన్నారు. అందుచేత మాకు ముక్తి వద్దు, భక్తే చాలు అనుకొంటారు. ముక్తి వచ్చేస్తుంది కాని వారికి

అలా అనిపిస్తుంది. మనలను ముక్తిలోనికి తీసుకొనివెళ్ళేది భక్తి అందువలన భక్తిని అలవర్చు కోండి. కొంతమందికి కోపాలు ఉన్నా నన్ను పొందటంకోసం కోపాన్ని తగ్గించుకొంటారు, కొంతమందికి బాగా డబ్బు ఉన్నా నాకోసం ఆ డబ్బును ఖర్చుపెడతారు, కొంతమందికి బాగా తెలివితేటలు ఉంటాయి, నాకోసం ఆ తెలివిని ఉపయోగిస్తారు, వారు నా స్వరూపాన్ని పొందుతారు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మనం పెద్దపెద్ద పనులు చేయనక్కరలేదు. చిన్నచిన్న పనులే అందంగా, నిరాడంబరంగా, నిరహంకారంగా చేస్తే ఆ వస్తువు దగ్గరకు మనం వెళ్లటం కాదు, ఆ వస్తువే వచ్చి మనలను వరిస్తుంది. భగవంతుడికి ఎక్కువ, తక్కువ అని ఏమీ లేదు. ఇది పుణ్యం, ఇది పాపం, ఇది మంచి, ఇది చెడు, ఇది ధర్మం, ఇది అధర్మం అని మనం అనుకొంటూ ఉంటాము. ఈ ద్వంద్వాల నుండి ఎప్పుడైతే విడుదల పొందామో అప్పుడు బ్రహ్మంలో ఐక్యమవుతాము, అంతవరకు సాధ్యం కానే కాదు. మనిషికీ మనిషికీ రూపాలలో బేధం ఉంది, గుణాలలో బేధం ఉంది, వారి ఆదర్శాలలో బేధం ఉంది అయినా జ్ఞాని అందరినీ సమానంగానే చూస్తున్నాడు అదెలా సాధ్యం? సమత్వం అనేది జ్ఞాని యొక్క లక్షణం. రూపాలు తేడా, నామాలు తేడా, గుణాలు తేడా కాని అందరికి ఆధారంగా, అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నవాడు ఒక్కడే. వాడిని చూసేవాడే నిజమైన చూపులు కలవాడు. జ్ఞానికి అది సహజంగానే ఉంటుంది. ఈ రూపాలలో, నామాలలో, గుణాలలో తేడాలు జ్ఞానికి కనిపిస్తున్నప్పటికీ, ఈ బేధాలు అన్నీ పైకి కనిపించేవి మాత్రమే, ఇవి నిజం కాదు అని ఆయనకు తెలుసు. మీరు మంచివారు అంటాము అనుకోండి, మంచితనం అనేది ఒక గుణం. ఇవాళ మంచివారు రేపు చెడ్డవారు అవ్వవచ్చు. ఇవాళ చెడ్డవారు రేపు మంచివారు అవ్వవచ్చు. ఇదంతా మనస్సుకు సంబంధించిన విషయం. అందుచేత జ్ఞానికి ఇవి అన్నీ అప్రధానమైన విషయాలు. జ్ఞాని కళ్ళు మూసుకొన్నా అదే చూస్తాడు, కళ్ళు తెరిచినా అదే. భగవాన్ మీద ఒక పాట ఉంది, కళ్ళు మూసుకొంటే ఆయన్ని ఆయన చూసుకొంటాడు, కళ్ళు తెరిస్తే ఆయనలో ఏది ఉందో అది మనకు చూపిస్తాడు. జ్ఞాని యొక్క ఒక్క చూపు చాలు, ఒక్క మాట చాలు. అది ఎక్కడ నుండో అంతరాంతరాళాలలో నుండి వస్తుంది. అవి అహంకారాన్ని కేంద్రంగా పెట్టుకొని, లోకంలో ఏదో ఆశించి చెప్పిన మాటలు కాదు. జ్ఞాని మాటలు మనకు అర్థం కావు, మన మనస్సుకు అవి అందవు. ఒక జ్ఞానిని ఇంకో జ్ఞాని అర్థం చేసుకోగలడు కాని అజ్ఞాని అర్థం చేసుకోలేడు.

బుద్ధుడు ఎక్కువ దేవుడు గురించి మాట్లాడేవాడు కాదు. మధ్యవర్తులతో సంబంధం లేకుండా హృదయగుహలోనికి పంపటానికి ప్రయత్నం చేసాడు. దేవుడు ఉన్నాడా, లేడా అంటే ఆయన మౌనం వహించేవారు. గౌతమబుద్ధుడు నాస్తికుడు కాదు, ఆయన మరణానంతర జీవితాన్ని అంగీకరించాడు. నీవు సంపాదించుకో, శుభ్రంగా తిను, ఎంజాయ్ చెయ్యి, మరణానంతర జీవితం ఏమీ లేదు, ఈ దేహం ఒక్కటే నిజం, ఈ దేహయాత్రతో పాటు జీవితం అంతా అయిపోతుంది అని చెప్పేవాడు నాస్తికుడు. స్మశానంతో జీవితయాత్ర ముగుస్తుందని బుద్ధుడు చెప్పలేదు, ఆయన పునర్జన్మను అంగీకరించాడు. మనకు ఆయన గురించి సరిగ్గా తెలియక ఆయన నాస్తికుడు అనుకొంటున్నాము, అది మనం అర్థం చేసుకోవటంలో పొరపాటు. నిర్వాణ సుఖం గురించి బుద్ధుడు ఒక మాట చెప్పాడు. శరీరం ఏదో రోజు మరణిస్తుంది. శరీరం చనిపోయేటప్పుడు ఎవడైతే నూటికి నూరుపాళ్ళు సుఖ సముద్రంలో, ఆనందసముద్రంలో ఊగిసలాగుతున్నాడో వాడికి పునర్జన్మ లేదు అని చెప్పాడు. వేదాలలో ఇలా ఉంది అని ఆయన ఎప్పుడూ చెప్పలేదు నాకు ఎంతైతే తెలుసునో అంతే మీకు చెపుతున్నాను అన్నాడు కాని నేను సర్వజ్ఞుడను అని ఆయన ఎప్పుడూ చెప్పలేదు. మనకు పాండిత్యం ఉన్నంత మాత్రంచేత, ఐశ్వర్యం ఉన్నంత మాత్రంచేత మనోనిగ్రహం రాదు. మనం జీవించే విధానాన్ని బట్టి, మనకు ఉన్న శరణాగతిని బట్టి సమాజంపట్ల మనకు ఉన్న అవగాహనను బట్టి మనోనిగ్రహం ఆధారపడి ఉంటుందిగాని మనకు బాహ్యంగా ఉన్న ఆస్తిపాస్తుల మీద మనోనిగ్రహం ఆధారపడి ఉండదు. మీ మనస్సును మీరు శత్రువుగా తయారుచేసుకోవద్దు. మీ మనస్సును బాగుచేసుకోవటానికి మీరే ప్రయత్నం చేసుకోండి. ఎవరైనా సహాయం చేస్తే తీసుకోండి అంతేగాని సహాయంకోసం ఎదురు చూడవద్దు. మీ మనస్సు మీకు మిత్రుడుగా ఉంటే, మీ మనస్సు మీరు చెప్పినట్లుగా వింటూ ఉంటే సమాజం అంతా మీకు శత్రువులుగా అయినా మీ సుఖానికి, శాంతికి అడ్డులేదు. మీ మనస్సు మీకు స్వాధీనంలో లేనప్పుడు మీ ఇంట్లోనివారు, సమాజంలోనివారు మిమ్మల్ని సుఖపెట్టాలన్నా ఎవరూ సుఖపెట్టలేరు. మీ సుఖం మీమీద ఆధారపడి ఉంది కాని ఎవరో ఇతరుల మీద ఆధారపడి లేదు. మీ జీవితంలో హెచ్చు తగ్గులు రావచ్చును, ఇవన్నీ అప్రధానమైన విషయాలు. వీటిని చూసి మీ మనస్సును పాడుచేసుకోవద్దు. మిమ్మల్ని అదృష్టం వెంటాడుతూ ఉండవచ్చు. దురదృష్టం వెంటాడుతూ ఉండవచ్చు, ఇదంతా స్వప్న సమానము, అందుచేత ఇక్కడ టైమ్ వేస్ట్ చేసుకోవద్దు. మీ పని ఏదో మీరు చేసుకొంటూ, జీవితగమ్యాన్ని మర్చిపోకుండా మోక్షం

పొందటానికి ప్రయత్నం చేయండి. మీకు ఏమీ పని లేదు అనుకోండి. మాకు పని లేదు, పని లేదు అనుకోకండి. భగవంతుడి రూపాన్ని ధ్యానించుకోండి, భగవంతుడి నామాన్ని స్మరించుకోండి, భగవంతుడు చెప్పిన మాటలను శ్రవణం చేయండి, వాటిని మీ మనస్సులో తిప్పకోండి, వాటిని ప్రాక్టీసు చేయండి, వాటిని అనుభవంలోనికి తెచ్చుకొంటే మీకు సుఖం గురించి తెలుస్తుంది. అప్పుడు మీరు అనుభవించే సుఖంతో సమానమైన సుఖం ఇక్కడ లేదు, మరణించిన తరువాత కూడా ఉండదు అని ఇప్పడే మీకు ఈ శరీరంలో ఉండగానే అర్థమవుతుంది.

మీరు ఎవరూ మేము మంచివారము అనుకోవద్దు, మేము చెడ్డవారము అని అనుకోవద్దు. ఇలాగా అనుకోవద్దు, అలాగా అనుకోవద్దు. మీరు పొందవలసిన గమ్యమును నిరంతరం జ్ఞాపకం పెట్టుకోండి. మీ జీవితంలో మనస్సును కొంచెం హృదయాభిముఖం కనుక చేస్తే ఈ మంచి చెడ్డలకు, చావు పుట్టుకలకు, ఈ ప్రకృతికి అర్థం లేదు అన్న సంగతి మీకు తెలుస్తుంది. అందరి హృదయాలలో నేను ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. కాని మనం హృదయంలో వెతకటం మానివేసాము, ప్రకృతిలో వెతుకుచున్నాము. దేవుడు మన హృదయంలో ఉన్నాడు అంటున్నారు, ఉంటే మాకు ఎందుకు తెలియటం లేదు అని ఒకసారి భగవాన్‌ను అడిగారు. భగవాన్ ఏమని చెప్పారు అంటే నీ అలవాట్లలో నుండి, నీ మనస్సు యొక్క చాపల్యంలో నుండి, నీకు ఉన్న రాంగ్‌తింకింగ్‌లో నుండి ముందు బయటకురా. అప్పడు నీ హృదయంలో దేవుడు ఉన్నాడో లేదో నీకే తెలుస్తుంది. నువ్వు స్వార్థమే పరమార్థం అనుకొంటున్నావు. స్వార్థాన్ని విడిచిపెట్టవు, పరమార్థాన్ని అందుకొందాము అనుకొంటున్నావు, ఇది సాధ్యం కాదే. మీ భావన ఏదైనా ఉంటే ఇతరులకు స్పష్టంగా చెప్పండి, అంతేగాని మీ భావనలో అహంభావనను కలపకండి, అలా అహంభావనను కలిపితే మీరు పొల్యూట్ అయిపోతారు, ఎదుటివారిని పొల్యూట్ చేస్తారు. నాకు ఇష్టమైన పనులు చేయండి అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఆయనకు ఇష్టమైన పని అంటే నువ్వు సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని లోకసంగ్రహం కోసం ఏ పని చేసినా దానిని భగవంతుడు తన పనిగా స్వీకరిస్తాడు, నీకు స్పిరిట్యువల్ స్టేటస్‌ను ఇస్తాడు, అంతేకాదు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు.

ఈ దేహం కోసం ఎన్ని విరోధాలు పెట్టుకొంటున్నామో, ఈ దేహం స్మశానం దాకా వస్తుంది కాని తరువాత రాదు. ఇతరులకోసం మనం చేసిన సేవ ఏదైనా ఉంటే, మంచి

ఉంటే అది మాత్రం మరణానంతరం జీవుడి కూడా వస్తుంది. భగవంతుడి ప్రీత్యర్థం నువ్వు ఏదైనా పనిచేస్తే జన్మాంతరంలో అది నీ కూడా వస్తుంది. మీరు చేసిన మంచి ఈశ్వరుడికి అక్కరలేదు, మీరు చేసిన మంచి మీకు ఇచ్చేస్తాడు. మీరు భగవద్గీత చదువుకొంటూ భగవంతుడు చెప్పిన వాక్యానికి అనుగుణంగా మన మనస్సు పని చేస్తోందా, లేదా అని చూసుకోండి. ఎవరి మీద ద్వేషం పెట్టుకోవద్దు, రాగద్వేషములు తగ్గించుకోండి. రాగ ద్వేషాలు పెరిగితే మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. రాగద్వేషాలు తగ్గించుకొంటే మనస్సు అంతర్ముఖమవుతుంది, అంతర్ముఖమయిన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అందుచేత మనస్సును లోపలకు పంపటానికి ప్రయత్నం చేయండి. శాంతి అయినా, సుఖం అయినా హృదయంలోనుండి వచ్చేవికాని అవి బయటనుండి రావు అది మనం మరిచి పోతున్నాము. మనలను మనం సంస్కరించుకొంటే ఎవ్వరూ ఇవ్వలేని సుఖం, శాంతి మన హృదయంలో నుండి పొంగివస్తుంది. మీ పని మీరు శ్రద్ధగా చేసుకోండి, ఇతరుల మెప్పుల జోలికి వెళ్ళవద్దు. ఎవరైనా మిమ్మల్ని స్తోత్రం చేసినా పొంగిపోవద్దు, ఎవరైనా విమర్శించినా కృంగిపోవద్దు. ఎవరైనా స్తోత్రం చేసినా, విమర్శించినా అది అంతా అహంకారమే, మీ అహంకారం ఎంత నిజమో, వారి అహంకారం కూడా అంతే నిజం. ఈ నిందలకు స్తుతులకు, హెచ్చుతగ్గులకు, ఈ ద్వంద్వాలకు అతీతంగా ఈ శరీరం భూమి మీద ఉండగానే మనం ఎదిగి వెళ్ళాలి, అప్పుడు మనకు సుఖం, శాంతి, ఆనందం కలుగుతుంది. ఈ శరీరానికి మరణం వచ్చే రోజుకు మనం నూటికి నూరుపాళ్ళు సుఖాన్ని, శాంతిని ఎంజాయ్ చేస్తూ ఉంటే మీకు పునర్జన్మ లేదు, ఇది బుద్ధుడి ఉవాచ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-12-05, హైదరాబాద్

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున భగవాన్ శ్రీ రమణమహర్షి 126వ జయంతి. మహాత్ములు ఎవరైనా వారు ఆ శరీరమే అనుకొంటే ఇప్పుడు లేరు, కానివారు ఆ శరీరం కాదు. వారు శరీరం కాకపోతే ఎప్పుడూ ఉన్నారు, అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఉంటారు. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో, అన్ని పరిస్థితులలో సమానంగా ఏకంగా ఉండే వస్తువునే మనం చైతన్యం అని, ఆత్మ అని అంటున్నాము. ఆత్మజ్ఞానం సముపార్జించమని మన ఋషులు, పెద్దలు అందరూ కూడా మనకు బోధిస్తూ వచ్చారు. ఆత్మ అంటే పరాయిదేమీ కాదు, మన నిజమైన

ఇల్లే, మన హృదయంలోనే ఆత్మ ఉంది. భగవంతుడిని కూడా హృదయనివాసి అని మనం పిలుస్తాము. ఆత్మ యొక్క స్వరూపం సుఖం, శాంతి, ఆనందం, దాని స్వరూపం ఉండటం. అది మనకు అనుభవంలోనికి వచ్చేవరకూ ప్రతిజన్మలోనూ దుఃఖం, అశాంతి, వేదన, రోదన మనలను వెంటాడుతూ ఉంటాయి. కొంతమందికి బాహ్యపరిస్థితులు అన్నీ బాగానే ఉంటాయి కాని ఎప్పడూ దుఃఖంతో ఉంటారు. కొంతమందికి బాహ్యపరిస్థితులు అనుకూలంగా ఉండవు కాని ఎప్పడూ సంతోషంగా ఉంటారు. దీనినిబట్టి మనిషి దుఃఖానికి కారణం బాహ్యపరిస్థితులు కాదు అని మనకు తెలుస్తుంది. బాహ్యపరిస్థితుల మీద మన సుఖం, శాంతి ఆధారపడి ఉన్నాయి అని మనం అనుకొంటే బేసిక్‌గా మనకు ఏమీ తెలియదని అర్థం. మనకు వాచింగ్ లేదు, జీవితంలో వాచింగ్ ముఖ్యం. జీవితంలో మన పరిస్థితులను, మనస్సును వాచ్‌చేసుకొంటూ ఉండాలి. లోపల జరిగేది, బయట జరిగేది మనం పరిశీలనగా చూస్తూఉంటే మనకు తెలియకుండానే మన శరీరం, ఇంద్రియాలు, మనస్సు కండిషన్‌లోనికి వచ్చేస్తాయి. భగవంతుడు మనకు దేహం ఇచ్చాడు, ఇంద్రియాలు ఇచ్చాడు, మనస్సు ఇచ్చాడు, అనేక సదుపాయాలు ఇచ్చాడు, గురువును ఇచ్చాడు. అందరి హృదయాలలో నేను ఆత్మగా ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు కాబట్టి ఆయన ఇచ్చిన వాటిని అన్నింటిని సద్వినియోగం చేసుకొని హృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవాలి, అదే మన జీవిత గమ్యం. ఈ జన్మలో మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటూఉంటే వెంటనే ఒకవేళ లిబరేషన్ రాకపోయినా ఉత్తమజన్మ వస్తుంది. మన కోరికను బట్టి జన్మ రాదు, మన మానసికస్థాయిని బట్టి మనకు జన్మ వస్తుంది అది గుర్తు పెట్టుకోండి.

కర్మను యోగంగా చేయమని భగవంతుడు చెప్పాడు. కర్మను విడిచిపెట్టమని చెప్పలేదు. నేను చేస్తున్నాను అనే భావనను విడిచిపెట్టమని చెప్పాడు. కర్మఫలాన్ని కొంతవరకు సమాజానికి సమర్పించమని చెప్పాడు. దానివలన నీవు పవిత్రుడవు అవుతావు. మనం పత్రం ఇస్తున్నాము, పుష్పం ఇస్తున్నాము, ఫలం ఇస్తున్నాము, తోయం ఇస్తున్నాము, వీటితోపాటు సృష్టిరూపంలో ఉన్న ఈశ్వరుడికి కర్మఫలాన్ని కూడా కొంత సమర్పిస్తూ ఉండాలి. ఓడరేవులలో లైట్‌హౌస్ ఉంటుంది, సముద్రంలో ప్రయాణించేవారికి ఒడ్డు ఇక్కడ ఉంది అని తెలియజేస్తూ ఉంటుంది. అలాగే సత్యానుభవం పొందినవారిని కొంతమందిని భగవంతుడు పంపించి మనకు ఆదర్శంగా కూర్చోబెడతాడు. వారు ఏ స్థాయిని పొందారో ఆ స్థాయిని మనం

కూడా పొందితే సుఖి అవుతాము, దుఃఖాన్ని, అశాంతిని, ప్రకృతిని ఓవర్‌కమ్ చేస్తాము. ఇప్పుడు మీకు పరిస్థితులు అనుకూలంగా లేవు అనుకోండి, ఆ పరిస్థితులను ఓవర్‌కమ్ చేయగలిగితే సుఖం మిమ్మల్ని వరిస్తుంది. పరిస్థితులు గొప్పవా, ఆత్మ గొప్పదా? వారు అశాంతిని తీసుకొని వస్తున్నారు అనుకొంటారు వారు గొప్పవారా, మీ హృదయంలో ఉన్న భగవంతుడు గొప్పవాడా? వారి మీద, వీరి మీద నెపాలు నెట్టి మనం ఎస్కేపిజంకు అలవాటుపడ్డాము. శంకరుడు, రమణుడు, రామకృష్ణుడు మనకు లైట్‌హౌస్‌లలాగ ఉపయోగపడుతున్నారు. వీరికే బ్రహ్మజ్ఞానం ఉంది, ఇంకెవరికి లేదు అనుకోవద్దు. కొంతమందికి బ్రహ్మజ్ఞానం ఉంటుంది, అక్కడితో పరిమితమైపోతారు. కొంతమంది వారు అనుభవిస్తూ ఉంటారు, టీచ్ చేస్తూ ఉంటారు. మౌనంగా బోధిస్తారు, మాటల ద్వారా బోధిస్తారు. జ్ఞాని యొక్క శరీరం ఈశ్వరుడి స్వాధీనంలో ఉంటుంది. టీచింగ్ యొక్క ప్రయోజనం ఏమిటి అంటే చెప్పేవాడు ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయిలోనికి మనలను తీసుకొని వెళ్ళటమే టీచింగ్ యొక్క ప్రయోజనం, అందుచేత మీరు శ్రవణం చేయాలి, దానిని మననం చేయాలి, దానిని ధ్యానం చెయ్యాలి, ఆ సబ్జక్టును మీరు సొంతం చేసుకోవాలి. ఇంత చేస్తేగాని మీకు బ్రహ్మానుభవం కలుగదు. ఇంకొకటి మీరు నేర్చుకోవాలి. మీకు దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోతూ, సంతోషం వచ్చినప్పుడు పొంగిపోతూ ఇలా వాటితో తాదాత్మ్యం పొందుతూ ఉంటే మీరు ఎంత సాధన చేసినా హృదయం యొక్క లోతులలోనికి ప్రవేశంచలేరు, హృదయాభిముఖంగా మీ మనస్సు ప్రయాణం చెయ్యదు. మీకు దుఃఖం వస్తే తట్టుకోవాలి, సంతోషం వస్తే ఇముడ్చుకోవాలి. పాపం అంటే ఏమీ లేదు భగవదనుభవం పొందటానికి మనకు ఏదైతే అడ్డువస్తోందో, ఏదైతే మనలను భగవంతుడికి దూరం చేస్తోందో అదే పాపం.

మనకు అశాంతి వస్తోంది అనుకోండి. దానిని పరిష్కారం చేసుకోవాలి. మనకు ఎందుకు అశాంతి వస్తోంది, దేనితో తాదాత్మ్యం వలన ఇది వస్తోంది, దీనికి కారణం ఏమిటి అని చూసుకొని దానిని కట్ చేయాలి. కొంతమంది అశాంతి వస్తే కొద్దిసేపు గట్టిగా భజన చేసేస్తారు తరువాత మరల అశాంతి అలాగే ఉంటుంది. అది డైవర్షన్, అలా కాదు, ఆ సమస్య ఎందుకు వస్తోంది అని చూసుకొని దానిని పరిష్కరించుకోవాలి. దయగల హృదయం భగవన్నిలయం అని పెద్దలు చెపుతారు. మీకు దయ మంచిదే కాని అది మీ పురోగతికి అడ్డు రాకూడదు, అది మీ గమ్యం కాదు. దయకంటే చైతన్యం గొప్పది అది

మీరు మర్చిపోవద్దు.

తమిళనాడు రాష్ట్రంలో తిరుచ్చుళి అనే గ్రామంలో రమణస్వామి శరీరం తీసుకొన్నారు. పుట్టుక లేని వస్తువు ఒక శరీరం తీసుకొంది. వారికి శరీరంతో పని లేదు కాని టీచింగ్ కోసం శరీరం తీసుకొంది. బ్రహ్మంకు రూపం లేదు, నామం లేదు. రూపం లేనిదానిని, నామం లేనిదానిని మనం ఊహించలేము. అందుచేత బ్రహ్మం పట్ల దేవతాబుద్ధి కల్పించి విష్ణువు అని, శివుడు అని, కుమారస్వామి అని ఇలా ఏదో రూపంతో, ఏదో నామంతో ఆరాధిస్తున్నాము. కాని ఆ దేవతద్వారా మనం పొందేది బ్రహ్మమునే అంటే మనలను మనమే పొందుతున్నాము. భగవాన్‌కు 16వ సంవత్సరములోనే మరణానుభవం కలిగింది. శరీరం చనిపోయింది. శరీరంతో నేను చనిపోవాలి కదా, శరీరం పోయినా నేను ఉన్నాను అనే అనుభవం ఆయనకు కలిగింది. దేహం మరణించినా ఈ దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి, లోకంతోటి ఏమీ సంబంధం లేకుండా నేను ఉన్నాను అనేటువంటి అనుభవం కలిగింది. కొన్ని క్షణాల కాలంలో మృత్యువును జయించి అమృతానుభవం పొందాడు, ఆయనే రమణఋషి. అమృతానుభవం పొందిన తరువాత అక్కడ కూర్చొబెడితే ఎలాగ, టీచింగ్ కోసం అరుణాచలేశ్వరుడు ఆయనను అరుణాచలం తీసుకొని వచ్చాడు. అరుణాచలేశ్వరుడిపట్ల ఆయనకు జనకభావన ఉండేది. అరుణాచలం వచ్చినప్పుడు ఓతండ్రీ నా అంతట నేను ఇక్కడకు రాలేదు, నీ ఆజ్ఞననుసరించి వచ్చాను అని తనను తాను అరుణాచలేశ్వరుడికి నివేదన చేసుకొన్నాడు. అరుణాచలం వచ్చి నేను కొత్తగా పొందింది ఏమీలేదు, పొందవలసింది ఏదో అక్కడే పొందాను అని భగవాన్ చెప్పారు. కొంతమంది మిమ్మల్ని నిందిస్తూ ఉంటారు, కొంతమంది స్తోత్రం చేస్తూ ఉంటారు. ఇదంతా ఏమిటి అని అనుకోవద్దు. మిత్రులపట్ల, శత్రువుల పట్ల సమానబుద్ధి కలుగజేయటం కోసం, మీ బ్రెయిన్‌కు ఎంత తూకం ఉందో చూడటం కోసం, మీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళకుండా చూడటం కోసం ఈశ్వరుడు ఇదంతా చేస్తున్నాడు. ఇదంతా కూడా మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి ఈశ్వరుడు ఆడే ఆట అని మీకు తెలిస్తే మీరు క్వయిట్‌గా, కూల్‌గా ఉండగలరు. మనం వినటం ఎంత శ్రద్ధగా వింటామో అంత శ్రద్ధగా ప్రాక్టీసు చెయ్యాలి. ఇక్కడ హైకోర్టు ఎడ్వకేట్‌గారు కలిసారు. ఆయన రాత్రి 2 గంటల వరకు లా బుక్సు చదువుకొంటాను అని చెప్పారు. ఆయన చెప్పేది ఏమిటి అంటే అలా సబ్జక్టుపట్ల డెడికేషన్ వలన విషయచింతనే

లేదు అన్నారు. ఆయన కూడా మనకు గురువే. మనకు మోక్షం కావాలి అంటే ఆయన రాత్రి పగలు అనుకోకుండా లాను ఎలా ప్రాక్టీసు చేస్తున్నారో మనం శాస్త్రాన్ని అలా ప్రాక్టీసు చెయ్యాలి.

మనిషి జీవితం ఎప్పుడూ సమానంగా ఉండదు. హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి. బాహ్యంగా ఏమైనా కష్టాలు రావచ్చు, లోపల అశాంతి రావచ్చు, మీరు కల్పించుకొన్న అశాంతి ఉండవచ్చు. అంటే బయట గాలివాన, లోపల గాలివాన ఉన్నప్పటికీ మీరు సమానబుద్ధితోటి, శాంతచిత్తంతోటి ఉండగలిగితే ఈ జన్మలోనే మీరు జీవన్ముక్తులు అవుతారు, అంటే జీవించి ఉండగానే ముక్తిసుఖం మీ చేతికి అందుతుంది. నీవు చూడటానికి యోగిలాగ, ఋషిలాగ కనిపిస్తున్నావు, నీబోటి వాడికి ఇంటి దగ్గర పని ఏముంది, ఎక్కడికయినా పోరాదా అంటాడు అన్నగారు భగవాన్‌ను. ఎక్కడికి వెళ్ళాలి అనుకొంటాడు, అరుణాచలం అరుణాచలం అని లోపలనుండి ప్రేరణ వచ్చింది. అంతే బయలుదేరి అరుణాచలం వచ్చాడు. ఆయన అరుణాచలం వచ్చిన రోజున గుడిలోనికి వెళ్ళాడు. ఓ తండ్రీ నా అంతట నేను రాలేదు, నీ ఆజ్ఞననుసరించి వచ్చాను, ఈ దేహాన్ని ఎలా ఉపయోగించుకోవాలో అలాగ ఉపయోగించుకో అన్నాడు. భగవాన్‌కు ద్వేషించటానికి ఈ సృష్టిలో ఎవడూ లేడు, ప్రేమించటానికి ఈ సృష్టిలో ఎవడూ లేడు. కారణం ఏమిటి అంటే తనకంటే భిన్నంగా ఎవరూ లేరు, అంతా తానే, అది సుప్రీమ్ స్టేట్. విరూపాక్షగుహలో ఉండగా 1907వ సంవత్సరంలో గణపతిశాస్త్రిగారు భగవాన్ దగ్గరకు వచ్చారు. చదవవలసిన గ్రంథాలు అన్నీ చదివాను, చెయ్యవలసిన జపాలు అన్నీ చేసాను, సత్కర్మ చేసాను. తపస్సు అంటే ఏమిటో నాకు తెలియటం లేదు, లోపల ఉన్న ఆనందం అందటంలేదు అని భగవాన్‌ను అడిగారు. అప్పుడు భగవాన్ శాస్త్రిగారికి ఒక మాట చెప్పారు. మనకు నేను అనే తలంపు ఉంది. నేను అనే తలంపు ఎక్కడ నుండి ఉదయించి వస్తోందో అక్కడే బ్రహ్మం ఉంది. ఈ నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోందో విచారించు, అప్పుడు దాని మూలంలోనికి అది ఉపసంహరింపబడుతుంది. మూలతలంపు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది, అప్పుడు బ్రహ్మం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. నేను అనే తలంపు గురించి 1907లో శాస్త్రిగారికి బోధించారు. భగవాన్ శ్రీ రమణమహర్షి అని పేరుపెట్టింది శాస్త్రిగారు, రమణాశ్రమం అని పేరుపెట్టింది ఆయన, రమణగీత వ్రాసింది ఆయన, రమణుడు అంటే ఇట్టివాడు అని లోకానికి చెప్పింది ఆయన.

గణపతిశాస్త్రిగారు 1936లో బెంగాల్‌లో శరీరం విడిచిపెట్టారు. శాస్త్రిగారు శరీరం చాలించారు అని టెలిగ్రామ్ వచ్చింది. అప్పుడు ఒక భక్తుడు శాస్త్రిగారికి మోక్షం వచ్చిందా అని భగవాన్‌ను అడిగాడు. ఆయన గ్రేట్‌మేన్, నోబుల్‌మేన్ అని చెప్పారు. మోక్షం వచ్చిందా అని అడిగితే అదెలా సాధ్యం అన్నారు. మనస్సు, జగత్తు, ఈశ్వరుడు ఒకే ముద్దకింద అయితేనే నీకు మోక్షం, అప్పటివరకు మోక్షం లేదు. సెపరేట్‌నెస్ ఉన్నంతకాలం వాడు ఎంతటివాడు అయినా వాడికి మోక్షం లేదు. 1950 సంవత్సరం ఏప్రియల్ 14వ తేదీన భగవాన్ శరీరాన్ని విడిచిపెట్టారు. ఆయన ఇప్పుడు లేడు అని అనుకోకూడదు. దేహం పుట్టుక ముందు ఆయన ఉన్నారు, దేహం పోయిన తరువాత కూడా ఆయన ఉంటారు. ఆయన దేహం అయితే ఇప్పుడు లేరు. ఆ దేహంలో ఉన్నప్పుడు కూడా ఆయన దేహం కాదు, అందుచేత ఆయన ఎప్పుడూ ఉంటారు. దేహం మరణించిన తరువాత మనం ఉండము అనుకొంటాము. గాఢనిద్రలో నీకు దేహం ఎక్కడ ఉంది? గాఢనిద్రలో నీకు దేహం తోటిగాని, లోకంతోటిగాని, దేవుడుతోటిగాని సంబంధం ఉందా? ఏమీ సంబంధం లేదు. వీటితో సంబంధం లేదు కాబట్టి నువ్వు లేకుండా పోయావా? నువ్వు ఉన్నావు. ఆ ఉన్నది ఎవరు? నీకు తెలుసున్నా అది ఉంది, తెలియకపోయినా అది ఉంది. అయితే దానితో మనకు అనుబంధం వచ్చేవరకూ దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. దక్షిణామూర్తి పూర్తిగా మౌనం, ఆచార్యులవారికి టీచింగే పని. ఆచార్యులవారు చెప్పేది ఏమిటి అంటే సబ్జక్టును నీవు శ్రద్ధగా వింటూ ఉంటే 90% పని పూర్తి అయిపోతుంది, ఇంక నీవు చేసుకొనేది 10% మాత్రమే. ఆచార్యుడు అంటే కేవలం టీచ్ చేయటమే కాదు, నీ అవగాహనకు అందింపచేసేవాడు, నీచేత ఆ వస్తువును పొందింప చేసేవాడు ఆచార్యుడు. రమణమహర్షిగారు అటు దక్షిణామూర్తికాదు, ఇటు శంకరాచార్యుల వారు కాదు, ఆయన మద్యేమార్గం అవలంభించారు. ఎక్కువగా మౌనంగా ఉండేవారు. అవసరమయితే ఒకమాట చెప్పేవారు. నీ ప్రశ్నకు సమాధానం చెప్పవలసిన అవసరం లేదంటే మౌనంగానే ఉండేవారు. మౌనంగా ఉన్నా నిన్ను విడిచిపెట్టేవారు కాదు, మౌనంగా ఉండే నీ మనస్సుకు మెచ్యూరిటీని తీసుకొని వచ్చేవారు, అది ఆచార్యుడికే సాధ్యం.

మనం సమాజంతో తగుమాత్రంగా ఉండాలికాని అతిగా ఉండకూడదు. సమాజంతో అతిగాఉంటే మన స్వరూపానికి మనం దూరమయిపోతాము. ఈ లోకం మమ్మల్ని పీడించేస్తోంది, బంధువులు మమ్మల్ని ఏడిపిస్తున్నారు అంటారు. లోకంతోటి మనకు ఉన్న

అనుబంధం కరెక్టుగా లేదు, అందువలన దుఃఖం వస్తోంది. ఈ లోకం ఎవరినీ మీరు ఏడవండి అని చెప్పటంలేదు అయినా మనం ఏడుస్తున్నాము. మీ బంధువులు మిమ్మల్ని ఏడవమని చెప్పటం లేదు. లోకంతోటి, బంధువులతోటి మనకు ఉన్న అనుబంధం ఏడిపిస్తుంది కాని లోకం మనలను ఏడిపించదు. మీ కోడలు మిమ్మల్ని బాధపెడుతోంది అనుకోండి మిమ్మల్ని బాధపడమని ఎవరు చెప్పారు. మీ కోడలుకంటే మీరు బుద్ధి తక్కువవారా? ఎవరో ఏడిపిస్తూ ఉంటే మీరు ఏడవటానికి మీరు బుద్ధి తక్కువ వారా? వారికున్న బుద్ధి కూడా మీకు లేదా. మీకు డబ్బు ఉంది అనుకోండి, స్టేటస్ ఉంది అనుకోండి, భక్తి ఉంది అనుకోండి. మీకు ఆత్మవిశ్వాసం లేకపోతే మీకు మోక్షం రాదు. మీమీద మీకు నమ్మకం లేకపోతే దారిని పోయేవాడు కూడా వచ్చి మిమ్మల్ని ఏడిపిస్తూ ఉంటాడు. మీ గురించి మీకు ఒక అండర్‌స్టాండింగ్ ఉన్నప్పుడు ఇతరులు మిమ్మల్ని ఏమీ చేయలేరు. దేవదత్తమైన అధికారంతో ఆయన కుమారస్వామి అవతారం అని నేను చెపుతున్నాను అని గణపతిశాస్త్రిగారు భగవాన్ గురించి అనేవారు. నీకూడా పరివారం లేకపోయినా, ఆయుధాలు లేకపోయినా, నువ్వు ఒక్కడివే వచ్చినా నువ్వు కుమారస్వామివి అని నాకు తెలుస్తోంది అని శాస్త్రిగారు అనేవారు. ఆయన మాటలను భగవాన్ ఎప్పుడూ పట్టించుకోలేదు, సంతోషించలేదు. ఏవండీ గణపతి శాస్త్రిగారు మిమ్మల్ని కుమారస్వామి అవతారం అంటున్నారు అని అక్కడివారు భగవాన్‌ను అడిగితే ఏదో విగ్రహం పెడతారు కుమారస్వామి అంటారు, అలాగే ఈ దేహాన్ని ఆయనను అనుకోనివ్వండి, ఆయన నోరు ఎవరు కట్టగలరు అన్నారు, ఆయన రమణస్వామి. చాలా మందికి పొగడ్తలు అంటే ఇష్టం, అది చాలా ప్రమాదం. మిమ్మల్ని ఎవరైనా పొగిడారు అనుకోండి, వాటితో తాదాత్మ్యం పొందవద్దు, భవిష్యత్తులో మీకు వికారాలు వస్తాయి. పొగడ్తలను, విమర్శలను మీరు పట్టించుకోవద్దు. రమణమహర్షిగారు ఆ దేవుడి అవతారం, ఈ దేవుడి అవతారం అని ఒక పండితుడు పద్యాలు వ్రాసుకొని వస్తే భగవాన్ ఏమన్నారు అంటే నేను కుమారస్వామిని అనుకో, శివుడిని అనుకో, నేను గొప్పవాడిని అనుకో అయితే నీకు ఏమి కలిసి వస్తుంది, ఎందుకు ఇటువంటి మాటలు, నీవు బాగుపడే విధానం చూసుకో అన్నారు. దేశానికి, కాలానికి, పరిసరాలకు, పరిస్థితులకు, ఈ దేహానికి అతీతంగా ఉన్నవాడే జ్ఞాని.

దేహాన్ని పూర్తిగా నమ్మి నువ్వు మోక్షాన్ని పొందాలి అనుకోవటం ఎటువంటిది అంటే

ముసలిని నమ్మి నదిని దాటటం లాంటిది అని ఆచార్యులవారు చెప్పారు. ఈ దేహము మాత్రమే నేను అనే బుద్ధి కనుక పోకపోతే కోటిజన్మలు ఎత్తినా, నువ్వు ఎన్ని సాధనలు చేసినా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. కొంతమంది గౌరవం రాకపోతే మంచి పనులు కూడా చేయరు, అది దరిద్రం. అసలే మనం దరిద్రంతో ఏడుస్తున్నాము, ఇంకో దరిద్రం పోగుజేసు కొంటున్నాము. ఇలా గౌరవాలు ఆశించటం వలన మీకు గౌరవాలు వస్తే రావచ్చును, అసలు సున్న. మీ దేహం ఎంత నిజమో ఆ గౌరవాలు కూడా అంతే నిజం. కీర్తికాంక్ష కంటే దరిద్రం ఇంకోటి లేదు అని మిల్టన్ చెప్పాడు. కీర్తికాంక్ష పెరిగేకొలది దేహాభిమానం పెరిగిపోతుంది. దేహము నేను అనుకొంటున్నావు కాబట్టి కీర్తిని కోరుకొంటున్నావు. తనువు తానుకాదని తెలిసినవాడు కీర్తిని కోరుకోడు. కీర్తి కావాలి, గౌరవం కావాలి, గొప్పలు కావాలి అని మీరు అనుకొంటూ ఉంటే లోపల అసలు మీకు తూకం ఏమీ లేదు అని అర్థం. మనం శాంతిగా ఉన్నప్పుడు, లోపల పవిత్రంగా ఉన్నప్పుడు, మనం స్వార్థానికి కొంచెం దూరంగా ఉన్నప్పుడు ఈ ఉపాధి ద్వారా ఏవయినా మంచిపనులు జరుగుతాయి కాని లేకపోతే జరుగనే జరుగవు. మనం సత్వగుణంతోటి ఎవరికయినా ఉపకారం చేస్తే వారు సుఖపడతారు గాని రజోగుణం తోటి చేస్తే వారు సుఖపడరు. సాత్వికబుద్ధితో మనం ప్రవర్తిస్తే మన ద్వారా ఇతరులకు శాంతి, ఆనందం, సుఖం అందుతాయి. ఇంకోటి రిపీట్ చేస్తున్నాను, గుర్తు పెట్టుకోండి. ఈ లోకం మిమ్మల్ని ఏమీ బాధ పెట్టటం లేదు. ఈ గోడ ఎవరినైనా బాధపెడుతోందా? లేదు. నీ తలకాయ గోడకేసి కొట్టుకొని నన్ను గోడ బాధపెడుతోంది అంటే అసలు అర్థం ఏమిటి? అది గోడ తప్పా, నీ తప్పా. అలాగే లోకం ఎవరినీ బాధపెట్టదు. లోకంతో నీకున్న సంబంధం, లోకంతో నీకు ఉన్న ఎటాచ్‌మెంట్ నిన్ను పీడిస్తోంది కాని లోకం తనంతట తానుగా నిన్ను పీడించదు. మీకు అవకాశం ఉన్న వారందరు భగవద్గీతను అధ్యయనం చేయండి. అవకాశం ఉంటే ఆచార్యుడి ముఖతహ వినండి. దానిని అర్థం చేసుకోండి, దానిని మననం చేసుకోండి, దానిని అనుభవించండి. గీతామృతం బాగా తాగండి, మీకు తేన్పులు వచ్చేయాలి. మీ కప్పు నిండిపోయి, కారిపోవాలి. అప్పుడు మీ ద్వారా ఇతరులకు సహాయ సహకారములు అందుతాయి. మీరు దుఃఖంతో, అశాంతితో బాధపడుతూ ఉంటే ఇంక ఎవరికి శాంతినిస్తారు. కొంతమంది పెద్దలు ఏమని చెపుతారు అంటే మీరు దుఃఖంతో ఉంటే ఆ రోజు సాధ్యమయి నంతవరకు ఇంటి దగ్గరే ఉండండి. ఆ దుఃఖంతో బయటకు వచ్చి మీ చుట్టాలకు, స్నేహితులకు అంటించవద్దు. కొంతమంది బంధువులు ఎలాగ ఉంటారు అంటే వారికి ఏదైనా దుఃఖం

వస్తే ఆ దుఃఖం తగ్గేవరకు మనలను పీడించేస్తారు, వారికి ఏదైనా అదృష్టం కలిసివస్తే మాత్రం మనకు వాటా పంచరు, అసలు మనవంకే చూడరు. బంధువులు అంటే బంధించేవారు అన్నారు ఆచార్యులవారు. లోకం యొక్క తీరు ఇలా ఉంటుంది. ఓ అమాయకుడా దీనిని చూసి నువ్వు అప్‌సెట్ అవ్వవద్దు. కుక్క తోక ఎలాగ ఉంటుందో లోకం యొక్క పోకడ కూడా అలాగే ఉంటుంది. అది సహజం. మన జీవితాన్ని క్రమంగా నడపటానికే జపధ్యానములు. మనం చేయవలసిన సాధన ఏమిటి అంటే భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. భగవంతుడు ఇచ్చిన అవకాశములను మనం ఉపయోగించుకొంటూ ఉంటే అవే వంతెన కింద ఉపయోగపడి అశాంతిలో నుండి శాంతిలోనికి ప్రవేశిస్తాము. రమణస్వామి ఏమి చెప్పారు అంటే ప్రతీ దేహానికి పుట్టినరోజు ఉంటుంది. కనీసం మీ దేహం పుట్టిన రోజున అయినా ఈ నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోంది అని విచారణ చెయ్యండి. ఎందుచేతనంటే ఈ దేహం పుట్టినప్పుడు మీరు పుట్టలేదు, నేను అనే తలంపు పుట్టినప్పుడు మీరు పుట్టారు. ఈ నేను అనే తలంపు పరిష్కారం అయ్యేవరకూ భవిష్యత్‌లో కూడా ఇలా శవాలను మోస్తూనే ఉండాలి, ప్రకృతి మనలను విడిచిపెట్టదు అని చెప్పకుండా చెప్పటం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-01-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏకాగ్రత, భగవంతునియందు భక్తి తక్కువగా ఉంటోంది అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. భక్తి సంపాదన కూడా మీరు అనుకొన్నంత తేలికకాదు. ధనం సంపాదించాలంటే ఎంతో కష్టపడితేనే కదా ధనం మనకు వచ్చేది. భక్తిని సంపాదించటం మరింత కష్టం. పూర్వపుణ్యం లేకుండా భక్తి రాదు. మనమాట సౌమ్యంగా ఉండాలి, మనస్సు నిర్మలంగా ఉండాలి, శరీరంతో సత్కర్మ చేస్తూ ఉండాలి. ఇన్ని రకాలుగా చేస్తూఉంటే మనకు భక్తి కలుగుతుంది. భక్తికి మించిన సంపదలేదు. డబ్బు, చదువు, అధికారం అన్నీ మాయే. భక్తి వలననే మనం రోజులు సుఖంగా గడపగలుగుతాము, భక్తి వలననే మనకు జ్ఞానం కలుగుతుంది. గాంధీగారు ఎంత రాజకీయాలలో ఉన్నా జీవితం పొడుగునా భక్తిని విడిచిపెట్టలేదు, రామనామం విడిచిపెట్టలేదు. ఈ రాజకీయాలు అన్నీ మాయ అని ఆయనకు తెలుసు. మాటలతోకాదు పనితో కదా భగవంతుడిని పూజించేది అనేవారు పటేల్, ఆయన

చాలా నిరాడంబరంగా ఉండేవారు. ఇప్పుడు లోకంలో విలాసజీవితం పెరిగిపోతోంది, నిరాడంబరజీవితం తగ్గిపోతోంది. అది భక్తికి మంచిది కాదు. విలాసవంతమైన జీవితం గడిపే శక్తి ఉన్నా అది మంచిదికాదు. గాంధీగారిలో గొప్పతనం ఏమిటి అంటే ఆయనలో చిరాకు లేదు. ఆయన భావాలకు విరుద్ధంగా ఉన్నవారు వచ్చినా విసుగులేకుండా వారితో మాట్లాడేవారు.

పనిమీద మీ మనస్సును పెట్టండి, ఫలితం మీద పెట్టవద్దు. ఫలితంమీద మీ మనస్సు పెడితే చివరకు మీకు మోత మిగులుతుంది. భగవంతుడు ఒకో శరీరంతో ఒకోపని చేయిస్తాడు, అది మనం మర్చిపోకూడదు. మీ కుటుంబానికి సంబంధించిన పని ఎంత శ్రద్ధగా చేసుకొంటారో, సమాజానికి సంబంధించిన పని కూడా అంత శ్రద్ధగా చేయాలి. మన మతానికి సంబంధించిన పని చేసుకోవాలి, మతాలు మార్చుకోవలసిన అవసరం లేదు. మనం చెప్పిన మాటలు కొందరు ఇష్టపడతారు, కొందరు ఇష్టపడరు. కోపం, ద్వేషం తెచ్చుకోకూడదు. మీకు నచ్చిన పని మీరు చేసుకొంటూ ఉంటే, ఇతరులు విమర్శించినా మీరు భయపడకూడదు. మనం గుడికి వెళ్ళి పూజ చేయటమే కాదు, అందరి హృదయాలలో ఉన్న భగవంతుడిని సమానంగా చూడగలిగితే భగవంతుడికి పూజ చేసినట్లుగా భావిస్తాడు. ఆకలి వేసినవాడు అన్నం కోసం ఎలా చూస్తాడో భక్తి ఉన్నవాడు భగవంతుడికోసం అలా చూస్తాడు. డబ్బు ఎక్కువయితే ఒక ఇబ్బంది, డబ్బు తక్కువయితే ఒక ఇబ్బంది. డబ్బు ఎక్కువ ఉంటే అక్కడ స్థలాలు కొందామా, ఇక్కడ పొలాలు కొందామా, ఇంకా డబ్బు ఎలాగ పెంచుదాము అని ఆలోచిస్తాడు. డబ్బు వలన ఇంట్లో పేచీలు, దావాలు, ఆ కుటుంబం అంతా అల్లరి అయిపోతుంది. ఇంకవారికి భగవంతుడి మీద ఏమి ఉంటుంది. అసలు డబ్బు లేకపోతే రోజు వెళ్ళదు. అందుచేత సామాన్య కుటుంబంలో నుండే భక్తులు వస్తారు, అలాగని ధనవంతులలో భక్తులు లేరనికాదు, జనరల్‌గా చెబుతున్నాము. ధర్మాన్ని అనుసరించి ఎవరైతే నడుస్తున్నారో, న్యాయం కోసం ఎవరైతే జీవిస్తున్నారో వారే సాధువులు. సాధువులతో సహవాసం చేయాలి. వారికి వంద కోట్లు ఉన్నాయి అంటాము, మనం బతికి ఉండగా దివాళ తీసినవారు ఉన్నారు, డబ్బు అంతా మాయ. మీ ఆస్తులను, డబ్బుని కాపాడుకోండి, కాని అదే నిజం అనుకొని మీరు భక్తిని వదిలేస్తే మీకు భగవంతుడు ఎలా తెలుస్తాడు. భగవంతుడికి సంబంధించిన జ్ఞానం మీకు తెలిసేవరకూ ఈ లోకం ఒక్కటే నిజం అని

మీకు అనిపిస్తుంది. జ్ఞానం కలిగాక ఇంక ఈ సృష్టి మీకు కనబడదు, ఈ సృష్టి అంతా భగవంతుడిలో లయమయిపోతుంది. కొంతమంది కాలక్షేపానికి సినిమాకు వెళ్ళినట్లుగా గుడికి వెళతారు, వస్తారు. లోపల జిజ్ఞాస ఉండదు. లోపల తూకం లేనివాడే ఆవెలితిని కవర్ చేసుకోవటానికి పైకి ఆడంబరంగా కనిపిస్తాడు. భక్తి లేకపోతే అమృతానుభవం కలుగదు, విజేయుడు అవ్వలేడు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి ఏ మనిషికామనిషి కృషి చేసుకోవాలి. డబ్బు సంపాదించినవారిని బాగా పైకి వచ్చారు అని అంటాము. రాగద్వేషాలు లేనివాడు, విషయచింతన లేనివాడు, సర్వకాల సర్వావస్థలలో ఆత్మచింతన చేసేవాడు మాత్రమే విజేయుడు, విజయుడు. మిగతావి అన్నీ ఫేల్యూర్సే. రాగద్వేషములు జన్మజన్మల నుండి మనలను అంటిపెట్టుకొని ఉన్నాయి. అవి అంత తొందరగా మనలను విడిచిపెట్టవు. ఈ రెండింటి వలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. భగవంతుడికి ఏది ప్రీతో దానిని మీరు ప్రీతిగా చేసుకోండి, దానివలన మీకు భక్తి పెరుగుతుంది. సృష్టిస్థితిలయములు అన్నీ చైతన్యంలో జరుగుతున్నాయి. ఆ చైతన్యంలో నీవు ఐక్యమయ్యే వరకు శవాలను మోయటం తప్పదు. భగవంతుడు మీకు చేయవలసిన ఉపకారం అంతా చేస్తాడు కాని ఎదురు చూడవద్దు. ఎదురుచూడటం వలన నీకు భారం పెరిగిపోతుంది. మీ దేహప్రారబ్ధాన్ని అనుసరించి ఆడించేవాడు ఆయనే. నీవు దేవుడి ప్రేమను నమ్మాలికాని మనుషుల ప్రేమను నమ్మకూడదు. నీ బుద్ధికి ఎలా తోస్తే అలా చేయకు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు. నీ ఆలోచనలో ఉన్న పొరపాట్ల వలన, విపరీతభావనల వలన, నీ మనోచాపల్యం వలన హృదయంలో భగవంతుడు ఉన్నా ఆయన మీకు తెలియటం లేదు.

వారి గురించి, వీరి గురించి ఆలోచించటం అనవసరం. భగవదనుభవం పొందకుండా ఏ వాసనలు, ఏ అలవాట్లు అయితే మనకు అడ్డువస్తున్నాయో జాగ్రత్తగా పరిశీలన చేసుకొంటూ వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. మీకు కోట్ల సంపద ఉంది అనుకోండి, వేయి ఎకరాలు ఉన్నాయి అనుకోండి దాచుకోండి. మీ దేహమే మీ కూడా రానప్పుడు మీ సంపద మీకూడా ఎలా వస్తుంది, రాదు. భక్తిని సంపాదించుకోండి, భక్తి మీకూడా వస్తుంది. స్మశానం వరకు వచ్చే శరీరం కోసం అనేక రకాల వైద్యాలు చేయించుకొంటున్నాము, దానికి తోడు ఎప్పుడు తగ్గుతుందని జోతిష్యాలు ఒకటి. శరీరాన్ని ఆరోగ్యంగా చూసుకోండి, మంచిదే. కాని ఈ శరీరం చనిపోయాక మన కూడా జీవుడు

వస్తాడు. ఆ జీవుడిని బాగుచేసుకొనే ప్రయత్నం మనకు లేదు, ఒక గమ్యం లేదు, సరియైన జీవితవిధానం లేదు. అటువంటి మనకా మోక్షం కలిగేది. రాత్రి నిద్రపోయేముందు తలుపులు అన్నీ జాగ్రత్తగా వేసామా లేదా అని చూసుకొంటాము, ఎందుకు? దొంగలు వచ్చేస్తారు అని. అలా చూసుకోవటం మంచిదే. అలాగే మీ మనస్సులోనికి చెడుతలంపులు రాకుండా, మనస్సు పతనమయ్యే ఊహలు మీకు రాకుండా తలుపులు వేసుకోవటం ఏమైనా నేర్చుకొన్నారా? దీనికి తలుపులు వేసుకోవటం నేర్చుకోవటమే సాధన. స్మశానం వరకు వచ్చే శరీరానికి చాలా జాగ్రత్తలు తీసుకొంటున్నాము కాని మరణానంతర జీవితంలో మన కూడా వచ్చే జీవుడి విషయం ఏమీ పట్టించుకోవటం లేదు. నువ్వు సత్పురుషులతో సహవాసం చేసి, ముముక్షత్వం పెంచుకొని, భగవదనుభవం పొందటానికి అడ్డువచ్చే బలహీనతలను సాధనచేసి తొలగించుకొంటే కదా హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు గోచరించేది. సంసార దుఃఖంలోనుండి, వేదనలోనుండి, రోదనలో నుండి నారాయణుడు తప్ప ఎవరు నిన్ను రక్షించగలరు. నీవు ఇష్టంగా, త్రికరణశుద్ధిగా శ్రీహరి స్మరణ చేస్తూ ఉంటే, ఆ నామస్మరణ వలన సంసారదుఃఖం తగ్గిపోతుంది. కోపం వచ్చి కొంతమంది సన్యాసం తీసుకొంటారు, వారికి మోక్షం రాదు. కొంతమంది జ్ఞానం కోసం సన్యాసం తీసుకొంటారు వారికి మోక్షం వస్తుంది. అన్ని అవస్థలలో, అన్ని కాలాలలో, అంతటా ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వచ్చేవరకు భగవంతుడిని సాకారంగా కాని, నిరాకారంగాకాని పూజించండి, ఆయనను జపించండి, ఆయనకు ఇష్టమైన పనులు చేయండి, ఆయన పాదాలను ఆశ్రయించండి. ఏదోరూపంలో ఉపాసన వలన, భగవంతుడు ఉన్నాడనే విశ్వాసం వలన, భగవంతుడి కోసం మనం జీవించాలి అనే శ్రద్ధ వలన ఏకాగ్రత పెరుగుతుంది. మీరు బంధువుల ఇంటికి పనిమీద వెళ్ళినప్పుడు, ఏపని మీద వెళ్ళారో అది మర్చిపోరు, మిగతావిషయాలు కొన్ని మర్చిపోవచ్చు. మనం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చామో అది మర్చిపోకూడదు. మనకు వివేకం లేకపోవటం వలన ఇది మర్చిపోతున్నాము. దొంగవాడు మన ఇంటికి వచ్చాడు అనుకోండి. వాడి మనస్సు అంతా మన ఇంట్లో ఉన్న బంగారం మీద ఉంటుంది, అయ్యో మన నిద్ర చెడిపోతోంది, చాలాశ్రమ పడుతున్నాము అని వాడు అనుకోడు. దొంగకు బంగారం మీద మనస్సు ఎలా ఉంటుందో అలాగ నీ మనస్సు భగవంతుడి మీద ఉంటే భగవంతుడు నీకు తెలియబడతాడు అని రామకృష్ణుడు చెప్పాడు. దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన ఈ మూడు శేషం లేకుండా నశించినవాడు పరిశుద్ధుడవుతాడు, పరమాత్మను

తెలుసుకోవటానికి అర్హుడవుతాడు.

చావాలంటే పుట్టాలి, పుట్టాలి అంటే చావాలి, ఇది చక్రం. ఇది ఎవరికి అంటే మనస్సుకు. ఆత్మకు దేహం లేదు. ఆత్మకు చావు లేదు, పుట్టుక లేదు. పుణ్యం, పాపం ఇవి అన్నీ దేహాభిమానికే. దేహం లేనివాడికి పుణ్యం లేదు, పాపం లేదు. డబ్బు లేని వారందరూ మాకు డబ్బు వస్తే దుఃఖం అంతా పోతుంది అనుకొంటారు. డబ్బు వస్తే దుఃఖం పోదు, దుఃఖం పెరిగిపోతుంది. మాయ ఎక్కడ ఉంది అంటే మనిషికి ఏదైతే లేదో అది వస్తే సుఖ పడిపోతాము అనుకొంటాడు, సుఖం అక్కడఉంటేకదా రావటానికి. సత్యవస్తువులో తప్పించి బయట ఎక్కడా సుఖం లేదు. దుఃఖం అంతా దేహాభిమానంలో ఉంది. అది ఉన్నంతకాలం నీవు కోటిజన్మలు ఎత్తినా దుఃఖం నశించదు. మన బుద్ధి బయటకు చూడటానికి అలవాటుపడిపోయింది. మీలో ద్వేషం ఉంటే నాకు ఎందుకు, నాలో ఏదైనా ద్వేషం ఉందేమో చూసుకొని దానిని తొలగించుకోవాలి. మీలో ఉన్న ద్వేషం నాకు కనబడుతోంది, నాలో ఉన్న ద్వేషం నాకు కనబడటం లేదు. ఎందుకు నాలో ఉన్న ద్వేషం నాకు కనబడటం లేదు అంటే బుద్ధి బయటకు చూస్తోంది కాని లోపలకు చూడటం లేదు. బుద్ధి అనేక జన్మల నుండి బయటకు చూడటానికి అలవాటుపడిపోయింది, ఇది ప్రమాదకర మైన అలవాటు. ఇలా ఎంతకాలం బయటకు చూస్తుందో అంతకాలం వాడంతటవాడు బాగుపడడు. ఎందుచేతనంటే వాడికి ఇతరులలోని దోషాలు కనిపిస్తాయి కాని వాడిలో ఉన్న దోషం వాడికి కనబడదు. ఇలా బాహ్యంగా తిరుగుతున్న బుద్ధిని మళ్ళించి, దానికి లోచూపు నేర్పేవాడే ఆచార్యుడు. గురువు అనుగ్రహం లేకుండా ఇది సాధ్యంకాదు. బుద్ధిలో ఒక్క దోషం ఉన్నా సత్యం మనకు అనుభవంలోనికి రాదు. ఆయనకు విరోధులుగా ఉన్న వారు వచ్చి మాట్లాడినా గాంధీగారు వారితో విసుగులేకుండా, చిరాకులేకుండా, నిర్లక్ష్యం లేకుండా మాట్లాడేవారు. మనకు ఇష్టంలేని బంధువులు వస్తేనే మనం నిర్లక్ష్యంగా మాట్లాడతాము. మీరందరూ భక్తిని పెంచుకోండి అని చెపుతాను అనుకోండి దానివలన పెద్ద ప్రయోజనం లేదు, అది మీకు లోపలనుండి వస్తే నిలబడుతుంది, నేను చెప్పటం వలన వచ్చేయదు. మనం భగవంతుడి యందు భక్తి కలిగి ఉంటే ఆయన లోపల మనకు మార్గ దర్శకంగా ఉంటాడు. భగవంతుడు మనకు అనుభవంలోనికి వచ్చినప్పడు మనకు రెండో వస్తువు లేకుండా చేసేస్తాడు. ఉన్నది ఒక్కటే ఎటుచూసినా మనమే, సత్యానుభవం

పొందాలంటే కోపం పనికిరాదు, నిర్లక్ష్యం పనికిరాదు. చలి తగ్గటానికి చెరువు గట్టుమీద నాలుగు పుల్లలు అంటించి మంట వేసుకొన్నావు అనుకో, నీకు చలి తగ్గవచ్చు, ఆ మంట వలన చెరువులోని నీళ్ళు వేడుక్కుతాయా, వేడి ఎక్కవు. అలాగే నీవు అజ్ఞానంతో తింగర తింగరగా మాట్లాడినా వాటికి భగవంతుడు వేడెక్కడు, ఆయన సమానంగానే ఉంటాడు అన్నారు గాంధీజీ. నీవు ఈశ్వరుడిని గ్రహించి, ఆయన ఎవడో నీవు తెలుసుకొంటే, అంతటా ఉన్నవాడు ఆయనే, ఆయన తప్పించి ఏమీ లేదు అని ఆయనను తెలుసుకొన్నాక నీకు తెలుస్తుంది. అప్పుడు ఏది వచ్చినా అంతా ఆయన ప్రసాదమే అనుకొంటావు. ఆయన స్వరూపం అనంతం, సత్యం, అద్వైతం అని ఆయనను తెలుసుకొన్నాక తెలుస్తుంది. గాంధీగారు గొప్పవాడు అని మనం అనుకొంటాము, ఆయన జీవుడే. ఎందుచేతనంటే గాంధీగారు మరుసటి రోజున ప్రయాణం పెట్టుకొన్నారు కాని గంటలో పోయారు. ఈశ్వరుడు అటువంటి వాడు కాదు, ఆయనకు తెలియనిది అంటూ ఏమీ లేదు. గాంధీగారు ఇతరులకోసం జీవించి, సత్కర్మ చేసి మహాత్ముడు అయ్యాడు. ఇతరులకోసం జీవించేవాడు సజీవంగా ఉంటాడు. ఇతరులకోసం కనీసం మనస్సులో కూడా ఆలోచించని వాడు జీవించి ఉన్నా, వాడు శవంతో సమానము.

మనం జీవితంలో ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండాలి, నెగిటివ్‌గా ఉండకూడదు. మీరందరూ నాపట్ల ఎలా ఉన్నారో నాకు అనవసరం, మీ పట్ల నేను సవ్యంగా ఉన్నానా, లేదా అది చూసుకోవాలి. నా ప్రవర్తనను బట్టి నాకు మోక్షం వస్తుంది కాని మీ ప్రవర్తనను బట్టి నాకు మోక్షం రాదు. ఇతరులు మీపట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో ఆ గొడవ మీకు వద్దు. మీరు ఇతరుల పట్ల సవ్యంగా ప్రవర్తిస్తున్నారో లేదో చూసుకోండి. దానివలన మీరు ఈశ్వరుని దయకు పాత్రులవుతారు, అప్పుడు ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు, అదే మోక్షం. అదే నిర్వాణస్థితి, ఆ స్థితిని పొందేవరకు సముద్రంలో ఎన్ని కెరటాలు ఉంటాయో అన్ని జన్మలు మనకు వస్తూనే ఉంటాయి, ఇది ప్రకృతి. మాయచేతిలో నీవు ఉన్నావు అందుచేత మాయ నిన్ను ఆడిస్తుంది. మాయ ఈశ్వరుడిని ఆడించలేదు ఎందుచేతనంటే మాయ ఆయన చేతిలో ఉంది. ఇది మీ బుద్ధికి అందదు, ఈశ్వరుడిని తెలుసుకొన్నాక మీకు తెలుస్తుంది. మీరు నెమ్మదిగా ప్రయాణించినా ఇబ్బంది లేదు, సరియైన మార్గంలో ఉన్నారో లేదో జాగ్రత్తగా చూసుకోండి. తప్పటడుగులు వేయవద్దు. విశ్వాసంతో అడుగులు వెయ్యండి. విశ్వాసం ఉన్నవాడికి సొమ్ము, విశ్వాసం లేనివాడికి దుమ్ము. మీరు ఏపని చేసినా కృత్రిమంగా

చేయవద్దు, నార్మల్‌గా, నేచురల్‌గా చేయండి. మీరు ఈ భూమి మీదకు వచ్చి వెళ్ళిన గుర్తు కూడా లేకుండా చేయండి. డబ్బు ఒక్కటే ఐశ్వర్యం కాదు. నీ శాంతి, సుఖం, ఆరోగ్యం అంతా ఐశ్వర్యమే. మోక్షానికి మించిన ఐశ్వర్యం లేదు. మీరు కంగారుపడవద్దు. సాధన ప్రారంభంలో చేదుగా ఉంటుంది, అలా సాధన చేయగా చేయగా కొంతకాలానికి అది అమృతం అయిపోతుంది. మన బుద్ధిలో దోషాలు ఉంటే మనం ఈశ్వరుని స్వరూపం పొందలేకపోవచ్చు. ప్రయత్నం చేస్తూ ఉంటే రాబోయే జన్మలో అయినా ఆ వస్తువు దొరుకుతుంది. అసలు మనం ప్రయత్నం అంటూ చేయాలి. మన ప్రయత్నాన్ని సాకుగా తీసుకొని ఆయన అనుగ్రహిస్తాడు. ఈశ్వరుడి యొక్క శక్తి మీదగాని, ఆయన అనుగ్రహం మీదగాని మనకు విశ్వాసం కుదరకపోతే ఈశ్వరుడి మీద మనకు భక్తి కుదరదు. ధ్యానం చేయటం, జపం చేయటం మీకు కష్టంగా ఉంటే మొత్తం సాధన వదిలిపెట్టకండి. నాకు ఇష్టమైన చిన్న చిన్న పనులు చేయండి, వాటిని సాకుగా పెట్టుకొని మిమ్మల్ని అనుగ్రహిస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-01-06, మల్కిపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీరు సబ్జక్టును బాగా అర్థంచేసుకోవటానికి ప్రయత్నం చేయండి. ఎవరు చెప్పినా సబ్జక్టును బాగా అర్థం చేసుకోవాలి. సబ్జక్టు అర్థంకాకపోతే ఎన్ని వేల జన్మలు ఎత్తినా మీకు జ్ఞానం రాదు, జ్ఞానం రాకపోతే సుఖం రాదు. మన హృదయంలో ఉన్న భగవంతుడి స్వరూపంలో తప్పించి సుఖం ఎక్కడా బయటలేదు, ఏ లోకంలోనూ సుఖం లేదు అని శాస్త్రం చెబుతోంది. ఇది ముందు మనకు తెలియాలి. అసలు సుఖం ఎక్కడ ఉంది, సుఖం కోసం మనం ఎక్కడ వెతుకుచున్నాము. ఆ తేడా మనకు తెలియాలి. సుఖం మన హృదయంలో ఉంది కాని సుఖం కోసం మనం లోకంలో వెతుకుతున్నాము. అందుచేత కోటిజన్మలు ఎత్తినా మనకు సుఖం దొరకదు. పరిపూర్ణమైన సుఖం మనం పొందేవరకు పునర్జన్మలు వస్తాయి, ప్రకృతి మనలను విడిచిపెట్టదు. శరీరాన్ని శుచిగా ఉంచటం కోసం మనం రోజూ స్నానం చేస్తాము. బయటశుచి మంచిదే కాని లోపలశుచి కూడా ఉండాలి అని భగవంతుడు చెపుతున్నాడు. లోపలశుచి అంటే మన బుద్ధి శుచిగా ఉండాలి. మన బుద్ధి శుచిగా ఉండాలంటే జపం చేయాలి, ధ్యానం చేయాలి. భగవంతుడి యొక్క హృదయం

చాలా విశాలమైనది. గీతలో పరమాత్మ ఏమి చెప్పాడు అంటే ఎవరు ఏ రూపాన్ని ధ్యానం చేసినా, ఏ నామాన్ని స్మరించుకొన్నా అందరూ నన్నే చేరతారు అని చెప్పాడు. భగవంతుడికి అనేక రూపాలు ఉన్నాయి, అనేక నామాలు ఉన్నాయి. అందుచేత మీకు ఇష్టమైన రూపాన్ని ధ్యానించుకోండి, మీకు ఇష్టమైన నామాన్ని స్మరించుకోండి. జపధ్యానముల వలన వివేకం పెరుగుతుంది. మన బుద్ధి శుచి అయితే, ఇది మంచి ఇది చెడు, ఇది మనకు సుఖాన్ని ఇస్తుంది ఇది దుఃఖాన్ని తీసుకొని వస్తుంది అని విడదీసి మనకు స్పష్టంగా చూపిస్తుంది. బయటశుచి ఎంత ముఖ్యమో లోపలశుచి కూడా అంతే ముఖ్యం. భక్తిపేరు మీద మొద్దబ్బాయిలుగా ఉండకూడదు, వివేకం పెంచుకోవాలి, బుద్ధిసూక్ష్మత పెంచుకోవాలి. ఇది నిత్యం, ఇది అనిత్యం అనేటువంటి తేడా మనకు తెలియాలి.

మనం ఏమి చేస్తున్నాము అంటే దేహానికి సంబంధించిన విషయాలను, మనస్సుకు సంబంధించిన గుణాలను లోపలఉన్న మన స్వరూపం మీద ఆరోపించుకొంటున్నాము. అంటే మనం కాని విషయాలను మనం ఏదిగా ఉన్నామో దానిమీద ఆరోపించుకొంటున్నాము. అదే అహంకారం. దేహం చనిపోతుంది. దేహం చనిపోయినప్పడు నేను చనిపోతున్నాను అనుకొంటున్నావు. నువ్వు చనిపోవు. నువ్వు ఎవరిగా ఉన్నావు? ఆత్మగా ఉన్నావు. ఆత్మకు చావులేదు. దేహానికి సంబంధించిన చావును తీసుకొనివెళ్ళి ఆత్మమీద ఆరోపిస్తున్నావు. బయట దుష్టచతుష్టయం, లోపల దుష్టత్రయం. మన మనస్సులో ముగ్గురు దుష్టులు ఉన్నారు. కోరిక, కోపం, లోభిత్వం ఇవే దుష్టత్రయం. దుష్టత్రయం చేసేది ఏమిటి అంటే మనకు తెలివితేటలు కలుగనివ్వరు, మనలను బాగుపడనివ్వరు. మీకు ఎంతోకొంత సుఖం అందటం కోసమే ఈ జ్ఞానయజ్ఞాలు అంతేగాని గొప్పలకోసం, గౌరవాలు కోసంకాదు. ఎవడైతే గొప్పల కోసం, గౌరవాల కోసంప్రాకులాడుతున్నాడో వాడికి కోటిజన్మలు ఎత్తినా జ్ఞానం రాదు. ఇది దేహము, ఇది మనస్సు అని తేడా ఎంతోకొంత ఇప్పడు మనకు తెలుస్తోంది కదా అలాగే ఇది మనస్సు, ఇది ఆత్మ అని తేడా తెలియాలి, ఆ తేడా తెలిసిందా మీకు మాయ దారి ఇచ్చేస్తుంది. మేము కష్టాలు అనుభవిస్తున్నాము, ప్రారబ్ధం అనుభవిస్తున్నాము అని చాలామంది అంటారు. ఆ అనుభవించేది ఎవరు? మీ మనస్సు అనుభవిస్తోంది కాని ఆత్మ ఏమీ అనుభవించదు. అసలు ఆత్మకు పుట్టుకలేదు, పుట్టుక లేనిదానికి ప్రారబ్ధం ఏమి ఉంటుంది. మనస్సులో దుఃఖం ఉంది, ఆత్మలో సుఖం ఉంది. ఇది మనస్సు, ఇది ఆత్మ అని

విడదీసుకొన్నప్పుడు ఏమవుతుంది అంటే మనస్సును తీసుకొని వెళ్ళి ఆత్మమీద ఆరోపించరు. అప్పడు మనస్సులో ఉన్న దుఃఖం అణిగిపోతూ ఉంటుంది, ఆత్మలో ఉన్న సుఖం మీకు తెలుస్తూ ఉంటుంది. ఆత్మసుఖం మీరుపొందేవరకు పునర్జన్మలు వస్తూఉంటాయి. ఎందుచేత వస్తూ ఉంటాయి అంటే ఆత్మసుఖం పొందేవరకు మనం సుఖం కోసం బజారులో వెతుక్కొంటూ ఉంటాము. బజారులో వెతుక్కోవాలి అంటే దేహం రావాలి కదా. అందుచేత మనం గమ్యాన్ని మర్చిపోకూడదు. మనం పూజలు చేస్తున్నాము, జపాలు చేస్తున్నాము, వ్రతాలు చేస్తున్నాము. వీటి అన్నింటి యొక్క ప్రయోజనం ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం. వీటి ప్రయోజనం ఆత్మజ్ఞానసముపార్జన. ఆత్మజ్ఞానం కలుగకపోతే మనకు ఆత్మసుఖం తెలియదు. ఆత్మసుఖం తెలియకపోతే పునర్జన్మలు తప్పవు. మనస్సు యొక్క వేగం తగ్గాలంటే స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం తీసుకొనే ఆహారం తగుమాత్రంగా ఉండాలి, సాత్వికంగా ఉండాలి. అప్పడు మీకు జ్ఞాపకశక్తి పెరుగుతుంది, వివేకం పెరుగుతుంది.

మనుషుల ప్రేమ అసలు నిజం కాదు, భగవంతుడి ప్రేమ ఒక్కటే నిజం. మీరు ఒకటి బాగా జ్ఞాపకం ఉంచుకోండి. ఇతరులు మిమ్మల్ని ప్రేమించవచ్చు, మీరు ఇతరులను ప్రేమించవచ్చు కాని ఆ ప్రేమల మీద ఆధారపడవద్దు. మనుషుల ప్రేమల మీద ఆధారపడ్డారా భవిష్యత్తులో మీకు మిగిలేది దుఃఖం. సర్వసాధారణంగా మనిషి అహంకారం లేకుండా ఉండడు, వాడి అహంకారం మీద ఆధారపడి ఎంతకాలం బతుకుతాము. మనం సంతోషం కోసం, సుఖంకోసం ఇతరుల మీద ఆధారపడితే మనకు లోపల తూకంలేదు అని అర్థం. మీరు ఇతరులను ప్రేమించవచ్చు, అది ఒక నాటకంలాగ ఉండాలి. భగవంతుడి యొక్క ప్రేమ మీద ఆధారపడాలి, ఆయన మనకు ఇచ్చే జ్ఞానం మీద ఆధారపడాలి అంతేగాని మనుషుల మీద ఆధారపడితే చివరకు మిగిలేది సున్న. ఇప్పడు మీ అత్తగారిని మీరు బాగాప్రేమిస్తున్నారు అనుకోండి, ఆవిడ మిమ్మల్ని ప్రేమిస్తోంది అనుకోండి. ఏదో క్షణంలో మిమ్మల్ని ప్రేమించటం మానివేసింది అనుకోండి మీకు దుఃఖం వచ్చేస్తుంది. అందుచేత మీ అత్తగారు మిమ్మల్ని ప్రేమిస్తే ప్రేమించనివ్వండి. కాని మీరు లోపల హృదయాంతరాళాలలో ఆ ప్రేమ మీద ఆధార పడకండి, ఊరికే ఆధారపడినట్లు నటించండి, కాలక్షేపం అయిపోతుంది. నిజంగా ఆధారపడితే చివరకు మిగిలేది దుఃఖం. ఏమో ఆవిడకు ఎప్పడు వికారం వస్తుందో చెప్పలేము. మీ ఇంట్లో వారిని ప్రేమించండి, వాళ్ళు మిమ్మల్ని ప్రేమిస్తారు. అలా ఒకరిని ఒకరు

ప్రేమించుకోండి కాని అది నిజం అని మటుకు అనుకోవద్దు అది నేను చెప్పేది. అది నిజం అనుకొన్నారా మీ హృదయంలో ఉన్న నిజం ఇంక మీకు తెలియదు. ఎదుటివారు మర్యాదగా మాట్లాడుతూ ఉంటే మీరు కూడా మర్యాదగా మాట్లాడండి. మీరు బాగున్నారా అంటే మీరు బాగున్నారా అనుకోండి. వారు మీకు సహాయం చేయవచ్చు, మీరు వారికి సహాయం చేయవచ్చు. ఈ నటన అంతా మామూలే కాని ఇదంతా నిజం అని అనుకోవద్దు. మనం బంధువులను, స్నేహితులను పోగుచేసుకొంటాము, ఈ శరీరం చనిపోయిన తరువాత ఒక్క ఈశ్వరుడితో తప్ప ఎవరితోను మనకు సంబంధం ఉండదు. శరీరం చనిపోయిన తరువాత ఏ ఈశ్వరుడితో మనకు సంబంధం ఉంటుందో దానిని వదిలేసి ఇక్కడ తాత్కాలిక మెరుపుల కోసం చూసి మీరు బోల్తాపడకండి, మాయలో పడకండి.

మనం వివేకాన్ని పెంచుకొంటూ రావాలి. మన మనస్సు ఎప్పడూ శరీరంతో జత వేసుకొని తిరుగుతూ ఉంటుంది. వివేకం పెరుగుతూ ఉంటే మనస్సు శరీరంతో జత కట్టటం మానివేస్తుంది, లోపలఉన్న చైతన్యం వైపుకు జరుగుతూ ఉంటుంది. మనం బాగుపడాలి, మనకి జ్ఞానం వచ్చేయాలి అంటే వచ్చేయదు. ఏ హృదయంలో అయితే భగవంతుడు ఉన్నాడో అటువైపుకు మనస్సు యొక్క చూపు మళ్ళింపబడాలి అంటే మనస్సు లోపలకు ప్రయాణించాలి. మనస్సు బాహ్యముఖానికి వస్తే దుమ్ము అంతా పోగుజేసుకొంటుంది, మనస్సుకు లోచూపు కలిగితే అది పవిత్రం అవుతుంది. మనస్సు బాహ్యముఖమయితే దుమ్ము, మనస్సు అంతర్ముఖమయితే జ్ఞానం. అహంకారం తొలగించుకోవటానికి ఏదోమార్గంలో ప్రయాణం చేయండి. భక్తిమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఇలా ఏదో మార్గంలో మీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చేయండి, దుర్మార్గంలో మటుకు ఉండకండి. మీకు ఆత్మజ్ఞానం లేకపోతే జనం చుట్టూ తిరగాలి. ఆత్మజ్ఞానం కలిగితే జనం చుట్టూ తిరగవలసిన పనిలేదు, మీ చుట్టూ జనం తిరుగుతారు, జ్ఞానం యొక్క వైభవం అట్టిది. మనం మాట్లాడే మాటలలో చాలా వాటికి మనకే అర్థం తెలియదు. ఓతండ్రీ వారు ఏమి మాట్లాడుతున్నారో వారికి తెలియదు, వారిని క్షమించి ఆశీర్వదించు అంటాడు క్రీస్తు. అందుచేత మనం ఎక్కువ మాట్లాడకూడదు. అవసరంలేని మాటలు మాట్లాడటం వలన మన బుద్ధి పాడైపోతుంది. అవసరమైన మాట కూడా ప్రీతిగా మాట్లాడాలి, ఎదుటివాడి క్షేమం కోరి మాట్లాడాలి. ఈ దేహానికి ఎప్పడు, ఏమి జరగాలో అది జరుగుతూ ఉంటుంది, అది ఎప్పడు చనిపోవాలో

అప్పుడు చనిపోతుంది. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టి, మీ సాధన ఏదో మీరు జాగ్రత్తగా చేసుకోండి, లోపల పరిశుద్ధులు అవ్వటానికి ప్రయత్నం చేయండి. బాహ్యంగా మీకు ఎంతమంది బంధువులు ఉన్నా, ఎంతమంది స్నేహితులు ఉన్నా, ఎంత అర్ధబలం ఉన్నా ఇవి అన్నీ స్వప్నసమానమే. దీనివలన ఇసుమంతయు జ్ఞానం కలుగదు. మనం కృత్రిమ జీవితానికి అలవాటుపడిపోయాము. మీకు వందకోట్లు డబ్బు ఉన్నా అది భగవంతుడి దృష్టిలో సున్నా, ఇవి అన్నీ ప్రకృతి గొడవలు. మన దేహం ఎంతనిజమో, మనస్సు ఎంత నిజమో ఈ చుట్టాలు, స్నేహితులు, సంపదలు అన్నీ కూడా అంతే నిజం. ఇవి పారమార్థిక సత్యం కాదు. నీ మనస్సు హృదయంలో ఐక్యమయ్యేవరకు మనస్సు నశించదు, వాసనలు నశించవు. ఎంతకాలం అయితే వాసన నశించదో అంతకాలం నీకు జన్మలు వస్తూనే ఉంటాయి, ప్రకృతి నిన్ను విడిచిపెట్టదు.

మనం మాట్లాడేమాటల వలనగాని, మనం చేసే పనుల వలనగాని, మన ఆలోచనల వలన గాని, మన మనస్సు పెరగకూడదు, వాటి వలన మనస్సు కరిగిపోవాలి. మనకు వచ్చే ఆలోచనల విషయంలో, మాట్లాడే మాటల విషయంలో, చేసే పనుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, అజాగ్రత్త పనికిరాదు. ఎందుచేతనంటే ఇవాళ కాకపోయినా కొంత కాలానికి అయినా మన ఆలోచనలే, మన మాటలే, మన చేతలే అలవాట్ల కింద మారతాయి. ఏదో సరదాగా మాట్లాడుతున్నాము అనుకొంటాము. ఈ సరదాకి మాట్లాడే మాటలే కొంత కాలానికి అలవాట్ల కింద మారిపోతాయి. ఈ అలవాట్ల యొక్క వేగమే మనకు పునర్జన్మలను తీసుకొని వస్తుంది. మనం చిన్నచిన్న విషయాలలో అజాగ్రత్తగా ఉంటే ఇవే బండరాళ్ళు అవుతాయి. దయ అవసరం అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఎవరు తిండికి, బట్టకు ఇబ్బంది పడుతున్నారో వారికి మీరు పది రూపాయలు ఇస్తే అది దయ అంతేగాని మీ గొప్పలు పెంచుకోవటానికి ఇతరులకు ఖర్చుపెట్టేది దయకాదు. మీ హృదయం ద్రవించి చేసే పని దయ. నీ అహంకారానికి తోచినట్లుగా చెయ్యవద్దు, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో. మనం హృదయపూర్వకంగా ఎవరిమీద అయినా దయ చూపిస్తూ ఉంటే అది వారికి అర్థం అవ్వక, మిమ్మల్ని విమర్శిస్తున్నారు అనుకోండి, మీకు ప్రకోపం రాకూడదు. గీతలో భగవంతుడు అనేక మంచివిషయాలు చెప్పాడు. కాని అవి మనకు అర్థమవ్వటంలేదు. ఎందుచేతనంటే మనకు సహనం లేదు, సత్వగుణం లేదు. అయితే అర్థమవ్వటం లేదు అని చదవటం

మానకండి, చదివినందుకు కొన్ని మార్కులు ఇస్తారు. మీరు ఎంత సాధన చేసినా దైవీ సంపద లేకుండా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. దైవీసంపద పెంచుకో, అసురసంపద తగ్గించుకో. దైవీసంపద పెంచుకోవాలంటే, అసురసంపద తగ్గించుకోవాలంటే సహనం ఉండాలి, సత్వగుణం ఉండాలి. సాత్వికప్రవృత్తి కోసం ఈశ్వరుడి పాదాలను ఆశ్రయించాలి. ఈశ్వరుడు అంటే ఇట్టివాడు అని మనకు తెలిస్తేనేకదా ఆయనను ఆశ్రయించాలనే బుద్ధి కలిగేది. సృష్టి ఉన్నప్పడు ఈ సృష్టికి యజమాని కూడా ఉంటాడు. ఆ యజమానిని ఆశ్రయించినా ఈ సృష్టిలో నుండి మనలను విడుదలచేస్తాడు. మనకు భగవంతుడు కంటే భగవంతుడు కల్పించిన విషయాలు అంటే ఎక్కువ ఇష్టం. భగవంతుడు కల్పించిన విషయాలకంటే భగవంతుడి యొక్క పాదాలను ఆశ్రయిస్తేనే మనకు మోక్షం కలుగుతుంది. నిజంగా మనం భగవంతుడికి శరణాగతి చెందితే, నీ ఇష్టమే నా ఇష్టం, నీ సంకల్పమే నా సంకల్పం, నాకు ఇష్టాలు, అయిష్టాలు అంటూ ఏమీలేవు. నాకు జీవితంలో మిగిలేది నీవే, ఉన్నది నీవే అని హృదయపూర్వకంగా భగవంతుడిని ప్రేమిస్తూఉంటే ఇంక సాధనపేరు మీద నీకు కష్టం లేదు, దుఃఖం లేదు. నీ దేహప్రారబ్ధంలో ఏది ఉంటే దానిని ఇష్టంతో చెయ్యి. ఇష్టంగా చేస్తే శాంతి, అయిష్టంగా చేస్తే అశాంతి.

మీరు ఇలా ఉండాలి అనుకోవద్దు, అలా ఉండాలి అనుకోవద్దు, ఎక్కువగా ఉండాలి అనుకోవద్దు, తక్కువగా ఉండాలి అనుకోవద్దు. మీ బంధువులతోగాని, స్నేహితులతోగాని పోల్చుకోవద్దు. హృదయంలో ఖాళీగా ఉండండి. మీకు ఈజన్మలోనే ఇప్పడే మోక్షం కలుగుతుంది. బయట ఏదో చెయ్యటం వలన ఇంతవరకు ఎవడికి ఆత్మజ్ఞానం కలుగలేదు బయట ఏదో చెయ్యటం వలన మీకు ఏదైనా పుణ్యం రావచ్చు. పుణ్యం, పాపం అనేవి మనస్సుకు సంబంధించినవి, చైతన్యంలో ఏమీలేదు. అయిష్టం ఎలా నరకాన్ని తీసుకొని వస్తుందో అలాగ ఇష్టం కూడా మనకు నరకాన్ని తీసుకొని వస్తుంది కారణం ఏమిటి అంటే అయిష్టంలో ఎంత దోషం ఉందో ఇష్టంలో కూడా అంతే దోషం ఉంది. కాని మనం అయిష్టం చెడ్డది, ఇష్టం మంచిది అనుకొంటాము. ఈ రెండూ మనస్సుకు సంబంధించిన విషయాలు. అయిష్టం వలన మనస్సు బజారులోనికి వచ్చేస్తుంది. ఇష్టం వలన కూడా మనస్సు బజారులోనికి వచ్చేస్తుంది. మీరు ఎవరినైతే చూసి ఇష్టపడుతున్నారో, కొంతకాలానికి వారు మిమ్మల్ని చూసి అయిష్టపడతారు అనుకోండి, మీకు దుఃఖం వచ్చేస్తుంది. ఆ బరువు మోస్తూ కృంగిపోయి

చనిపోతారు. ఇటువంటి బెంగలు మీకు ఎందుకు? మీరు ఆత్మ స్వరూపులు. మీరు మేక పిల్లలు కాదు, గొర్రె పిల్లలు కాదు, మీరు సింహం పిల్లలు. మీ దేహప్రారబ్ధంలో మీకు అధికారం ఉన్నా, ధనం ఉన్నా, చదువు ఉన్నా మీరు వాటితో కలవకండి. వాటితో కలిస్తే బతికిఉండగా దుఃఖం, చనిపోయిన తరువాత నరకం. కొంతమందికి కోట్ల డబ్బు ఉన్నా ఏడుస్తూ ఉంటారు, ఎదుటివాడి మూతి నాకుదాము ఏమన్నా రెండు మెతుకులు ఉంటే అంటుకొంటాయి అని చూస్తారు, వారి మూతి మనలను నాకనివ్వరు. వారికి నరకం రాకపోతే ఎవరికి వస్తుంది. కోరిక, కోపం, లోభిత్వం ఇవి దుష్టత్రయం, ఇవి మూడూ నరక ద్వారాలు. ఈ మూడు బలహీనతలు ఉండనక్కరలేదు, ఒక్క బలహీనత ఉంటే చాలు మనం నరకానికి పోతాము.

నీ దేహయాత్ర స్మశానంతో ముగిసిపోతుంది. జీవుడి యాత్ర స్మశానంలో ముగియదు. జీవుడు ఈ శరీరం ద్వారా కళ్లతో ఈ సృష్టిలోని విషయాలను, వస్తువులను చూస్తున్నాడు, చెవుల ద్వారా వింటున్నాడు. ఈ శరీరం ద్వారా సృష్టిలోని విషయాలను, వస్తువులను చూసే జీవుడు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. ఆ జీవుడే నువ్వు అనుకొంటున్నావు. ఆ జీవుడు నీవు కాదు, వాడే నకిలీ నేను. ఈ నేను నిజమైన నేను కాదు, అదే నకిలీ నేను. ఈ నకిలీ నేనును తప్పించగలిగితే అప్పుడు కదా నీకు మోక్షం కలిగేది. ఈ నకిలీ నేనును నువ్వు అనుకొన్నంతకాలం నువ్వు సాధనచేయలేవు. అదే నువ్వు అనుకొంటూ ఉంటే దానిని ఎలా పోగొట్టుకోగలవు. నిన్ను నీవు పోగొట్టు కోలేవు. అందుచేత శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని జీవిస్తేగాని ఈ నకిలీనేను చావదు. నకిలీ నేను నశిస్తేనేగాని లోపల ఉన్న నిజమైన నేను నీకు వ్యక్తం కాదు. అది వ్యక్తమయితేనే గాని జననమరణ చక్రం నుండి బయటకు రాలేవు. ఏదైతే నువ్వు కాదో అదే నువ్వు అనుకొంటున్నావు. అందులోనుండి విడుదల అయితేకాని నీకు నిజమైన నేను వ్యక్తం కాదు. అశాంతిపోతేనేగాని నీకు శాంతి రాదు. నకిలీ నేనును పోగొట్టుకొంటేనేగాని నీకు నిజమైన నేను దొరకదు. ఈ నకిలీనేనులో నుండి నిన్ను విడుదలచేయటం కోసం ఎప్పుడు ఎక్కడ నీ జీవితాన్ని ఎలా మలుపుతిప్పాలో చూసేవాడే నీ గురువు. మీ బాహ్యపరిస్థితులు బాగుచేయటం కోసం మీ అమ్మ ఎలా చూస్తుందో అలాగ మీకు ఏదైతే దుఃఖకారణమో అందులో నుండి విడుదలచేయటానికి గురువు చూస్తాడు, వాడే ఈశ్వరుడు. తల్లి మంచం పడితే కొంచం చాకిరీ చేస్తే తల్లి

ఋణం తీరిపోయింది అనుకొంటారు. గురువు ఋణం ఎలా తీరుతుంది అంటే గురువు ఏ స్థితిలో ఉన్నాడో ఆస్థితిని మనం పొందితే గురువు ఋణం తీరిపోతుంది.

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అంటున్నారు. అందులోనుండి ఈ మనస్సు ఎప్పుడు వచ్చేసింది అని అడుగుతున్నారు. ఈ మనస్సు గొడవ ఏమిటి పడలేకపోతున్నాము అంటున్నారు. మనస్సు అనేది లేదు, ఇది ఒక భ్రాంతి. ఉన్నది ఒక్కటే, దానిని చూసి మనస్సు అనుకొంటున్నావు. నీకు తాడు పాముగా కనిపిస్తోంది అనుకో తాడులో పాము ఉందా? నిజంగా పాములేదు. తాడే పాముగా నీకు కనిపిస్తోంది. అలాగే నీకు ఆత్మే మనస్సుగా కనిపిస్తోంది. ఆత్మని మనస్సు అని భ్రాంతి పడుతున్నాము. ఈ భ్రాంతిలో నుండి బయటకు వస్తే మనస్సు కనబడదు. మనస్సు ఎక్కడ నుండో రాలేదు ఆత్మే నీకు మనస్సుగా కనిపిస్తోంది. ఇది పాము కాదు, ఇది తాడే అని నీకు తెలిసినప్పుడు పాము కనబడదు. అలాగే నీకు జ్ఞానం కలిగాక ఇది మనస్సు కాదు, ఇది ఆత్మే అని నీకు తెలుస్తుంది. అప్పుడు మనస్సు కనబడదు. మనం ఇంద్రియ నిగ్రహం కోసం, మనోనిగ్రహం కోసం ప్రయత్నం చేస్తున్నాము, ఎలా చేస్తాము అంటే ఆముదం పుచ్చుకొన్నట్లు చేస్తాము, అలాచేస్తే నీకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం సాధ్యంకాదు అని ఆచార్యులవారు చెప్పారు. మీరు ఎవరి ఇంటికి అయినా వెళితే జున్ను పెట్టారు అనుకోండి. నెమ్మదిగా ఎంతో ఇష్టంతో చాలా బాగుంది అనుకొంటూ తింటారు. మీరు జున్ను తినేటప్పుడు ఎలా ఉంటున్నారో అంత ప్రీతిగా, అంత ఇష్టంగా ఇంద్రియనిగ్రహం కోసం, మనోనిగ్రహం కోసం కనుక ప్రాక్టీసుచేస్తే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం సాధ్యమవుతుంది అని చెప్పారు. నీ దేహానికి రోగం వస్తే మందు ఎలాగ వాడతావో అలాగ ఆకలి అనే రోగానికి తగిన ఆహారమే పెట్టు అని చెప్పారు. అంతేగాని అతిగా తినవద్దు. నీకు కోరికలు ఎక్కువగా వస్తూ ఉంటే నీ మనస్సు కుదురుగా లేదు అని అర్థం, నీవు భగవంతుడికి శరణాగతి చెయ్యలేదు అని అర్థం. భగవంతుని పాదాలయందు నీకు భక్తి లేనప్పుడు కోరికలు పెరుగుతూ ఉంటాయి. నీ మనస్సు నిర్మలంగా ఉంటే, నిశ్చలంగా ఉంటే, స్వచ్ఛంగా ఉంటే నీకు కోరికలతో పనిలేదు. నీకు కోరికలు పెరుగుతూ ఉంటే దేహభావన పెరుగుతూ ఉంటుంది. నీకు దేహభావన ఉన్నంత కాలం, ఈ దేహమే ఆత్మ, మనస్సే ఆత్మ అనుకొన్నంతకాలం అశాంతి నిన్ను విడిచిపెట్టదు. ఎవరైనా మిమ్మల్ని ప్రేమిస్తున్నారు అనుకోండి ప్రేమించనివ్వండి, లోపల మటుకు ఆ ప్రేమ మీద ఆధారపడకండి. ఆధారపడ్డారా మీరు సున్న అయిపోతారు. మరల వారు ప్రేమించటం

మానివేస్తే ఆ బరువు మీరు మొయ్యలేరు. దైవప్రేమ మనకు శాంతిని కలుగజేస్తుంది. మానవుడు ప్రేమించే ప్రేమలు మనుకు శాంతిని ఇవ్వవు, మనస్సుకు లోచూపు కలుగజేయవు. అందుచేత అయిష్టం ఎంత ప్రమాదమో ఇష్టం కూడా అంతే ప్రమాదం. ద్వేషం ఎంత ప్రమాదమో రాగంకూడా అంతే ప్రమాదం, ఇది జ్ఞాపకం ఉంచుకోండి. మనకు చైతన్యం కానిది గొప్పగా కనిపిస్తోంది. మనకు శరీరం గొప్పగా ఉంది, మనస్సు గొప్పగా ఉంది, మన బంధువులు, స్నేహితులు ఈ రూపాలు అన్నీ గొప్పగా కనిపిస్తున్నాయి. నీకు వైరాగ్యం లేకపోవటం వలన హృదయంలో ఉన్న సత్యవస్తువు తప్పించి మిగిలినవి అన్నీ గొప్పగా కనిపిస్తున్నాయి.

వైరాగ్యం లేనప్పడు లేనిది ఉన్నట్లుగా, ఉన్నది లేనట్లుగా కనిపిస్తుంది. వైర్యాగం లేని వాడికి జ్ఞానం రాదు. నువ్వు బతుకు కాని ఎవరిమీద ఆధారపడి బతకవద్దు. ఎవరి మీద అయినా ఆధారపడితే ఆధారాలు పోయినప్పడు నీకు మిగిలేది అశాంతి. భగవంతుడు చెప్పేమాట మీద గౌరవం లేకపోతే ఎంత విన్నా మనకు అర్థం కాదు. ఏ దేవుడు అయితే మనకు జ్ఞానాన్ని ప్రసాదిస్తున్నాడో ఆ దేవుడిలో దోషాలు వెతుకుతూ ఉంటే మనకు జ్ఞానం ఏమిటి? ఇటువంటి పాడుబుద్ధికా ఆత్మజ్ఞానం, భగవంతుడు గురించి శ్రవణం చేయకుండా ఆయన యొక్క ఔన్నత్యం ఎలా తెలుస్తుంది. భగవంతుడి యొక్క ఔన్నత్యం మీకు తెలియకపోతే ఆయన మీద గౌరవం ఎలా కలుగుతుంది. పూర్వజన్మలో చెడ్డకర్మలు చేసిన వారు దేవుడిని నమ్మరు, చెడ్డకర్మ నమ్మనివ్వదు. భగవంతుడిపట్ల పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే నువ్వు హిమాలయపర్వతాల లాంటి తప్పలు చేసినా ఆవు ఏవిధంగా అయితే దూడను నాకుతుందో అలాగ నీ తప్పలను, నీ బుద్ధిలోని దోషాలను నాకి నీ బుద్ధికి స్వచ్ఛత కలుగజేసి, జ్ఞానం సంపాదించాలనే బుద్ధిని కలుగజేసి, నీచేత సాధన చేయించి నీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. శరణాగతిమార్గంలో అయినా నకిలీ నేనును పోగొట్టుకోవాలి. భగవంతుడియందు భక్తి లేనప్పడు మీకు శరణాగతిమార్గం సాధ్యం కాదు. అప్పడు మీరు జ్ఞానమార్గంలోనికి వచ్చి నకిలీనేనులో నుండి విడుదలపొందాలి. కోరికలను నెరవేర్చుకొంటూ, నెరవేర్చుకొంటూ కోరికలను జయించినవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. భగవంతుడికి ఉన్న అన్ని పేర్లు మంత్రాలే. మన మనస్సును భగవంతుడి నామాల్లో నానబెట్టుకోవాలి, అలా నానబెడితే మన మనస్సు కరిగిపోతుంది. మనస్సు ఎప్పడైతే కరిగిపోయిందో అప్పడు హృదయంలో ఉన్న వస్తువు మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.

# మీతో(డు) మీరు!

## మీకోసం మీరు

ఉద్యోగం, ఇల్లు, పిల్లలు ఇలా చాలా పనులు, బాధ్యతల పేరిట నిరంతరం ఉండేవే. అయితే ఇందులోనే కొంత సమయం మీకోసం మీరు పనిచేయండి. అప్పడే మీరేంటో మీకు పరిచయమవుతారు. మిమ్మల్ని మీరుగా ఎవరో గుర్తించడం కాదు, మీరేంటో తెలుసుకొని.... అలా మిమ్మల్ని మీరు గుర్తించేందుకు అవసరమైన కృషి చేయండి. ఇలా మీతో మీరు మంచి సంబంధాలు ఏర్పరచుకొని, వాటిని నిరంతరం కొనసాగించిన తరువాతే మీకు ఎవరితో, ఎలాంటి వ్యక్తులతో సంబంధాలు అవసరమో అర్థమవుతుంది. అప్పడు మీరు ఎంచుకొనే స్నేహితులైనా, ఎవరైనా సరే మీకు మరింత ఆనందాన్ని పంచేలా ఉంటారు.

## మీకు మీరే తోడుగా

ఒక్కరుగా ఉండటం చాలా ఇబ్బందిగా ఉంటుంది కొంతమందికి. అయితే ఎవరికి వారే తోడుగా ఉండటాన్ని కూడా తప్పకుండా అలవాటు చేసుకోవాలి. అప్పడే ఎప్పడు, ఎలా ఉండాలన్నా (జీవితాన్ని అనుకున్నంత) ఆనందంగా జీవించటానికి దారులు విశాలంగా ఉంటాయి. అసలు మీరు ఒక్కరుగా ఉన్న సమయం మిమ్మల్ని మీరు చదువుకోవడానికి, ప్రశ్నించుకోవడానికి మీలో ఉన్న మీ తోడును వెతుక్కోవడానికి దొరికిన ఒక గొప్ప సువర్ణావకాశం.

జీవితంలో వేరొకరు తోడుగా లేని సందర్భాలను గడిపేందుకు అవసరమైన ఆసరాను ఇప్పడే మీకు పరిచయం చేస్తుంది. మీతోపాటు కొంత కాలం ఉన్న వ్యక్తి అది స్నేహితులైనా, బంధువులైనా, భాగస్వాములైనా, తల్లిదండ్రులైనా సరే ఒక్కసారిగా మీకు దూరమైనపుడు ఒంటరిగా ఉన్నామనే నిస్పృహ, నిరాశతో కూడిన ఆలోచనలు రావటం సాధారణమే. ఇలాంటి సందర్భాల్లోనే అభద్రతాభావం మిమ్మల్ని వెంటాడకుండా ఉండాలంటే మీకు మీరు తోడు అనే భావం మీలో ఉండాలి.

మీ ఆలోచనలు, ఆశయాలు, అభిప్రాయాలు ఇవన్నీ కలగలసిన మనిషి మీలో ఉన్నారు, మీకెప్పడూ తోడుగా ఉండి ముందుకు సాగిపోవడానికి అవసరమైన శక్తిని,

ఉత్సాహాన్ని ఇస్తారు అనే విషయాన్ని మీరు గ్రహిస్తే జీవితంలో మిమ్మల్ని ఎప్పుడూ వదలి వెళ్ళని ఓ గొప్ప తోడును సంపాదించుకొన్నట్లే.

## ఏకాంతంగా ఉండండి, ఒంటరిగా కాదు

మీతో మీరు సౌకర్యంగానే ఉండగలిగితే ఎప్పుడైనా ఒక్కసారి ఏకాంతంగా ఉండటానికి కేటాయించుకోండి. ఎందుకంటే ఈ సమయం మీతో మీరు బాగా దగ్గరవటానికి, మిమ్మల్ని మీరు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. వేరొకరు ప్రశ్నిస్తే ఓర్చుకోలేని ఎన్నో ప్రశ్నలు, వేరొకరు అభినందిస్తే రుచించని ఎన్నో అభినందనలు, మరెన్నో జాగ్రత్తలు మీరు వింటారు. మీతోడుగా ఉన్న మీలో ఒకరు చెబుతున్నారు కాబట్టి ఖచ్చితంగా వింటారు, ఆనందిస్తారు, పాటిస్తారు.

ఏకాంతంగా ఉండటం, ఒంటరిగా ఉండటం ఒకటి కాదు. మీలోకి మీరు తొంగి చూసుకోలేనప్పడే ఒంటరితనం ఆవరిస్తుంది. లేదంటే మీకు ఒంటరితనం గురించి ఆలోచించేంత సమయం కూడా ఉండదు. అంతే కాదు ఇలా ఒంటరి సమయంలో మీతో మీరు ఉండటం అలవాటు చేసుకుంటే మీలో ఒంటరితనం కూడా క్రమేపి తగ్గుముఖం పడుతుంది. మీగురించి ఎంతో సమాచారాన్ని మీకు అందిస్తుంది.

## మీ గురించి మీరు భయపడొద్దు

భయానికి విత్తనం అభద్రతాభావమే. జీవితంలో ఎవరికైనా భయం కంటే బద్ధ శత్రువే ఏదీ ఉండదు. ఎందుకంటే మనిషిలోనే ఉంటూ భయపెడుతూ వెనకడుగు వేయిస్తూ మరింత భయాన్ని జోడిస్తుంది, దాని శక్తిసామర్థ్యాలను పెంచుకొనే కొలదీ మనుషులు అసమర్థులవుతారు. అందుకే ఎప్పడూ మీ గురించి మీరే భయపడకండి.

మీ కోసం, మీ భవిష్యత్తుకోసం, మీ జీవితం కోసం ఇతరులు, కుటుంబ సభ్యులు, మీ మేలు కోరుకొనేవాళ్ళు భయపడటం కంటే మీరు భయపడటం చాలా చెడు చేస్తుంది. మీకు మిమ్మల్నే కాదు మీ శక్తి సామర్థ్యాలనూ దూరం చేస్తుంది.

ప్రయత్నంలో, పోరాటంలో, ఆటలో, పాటలో, ఆనందంలో, విచారంలో ఎక్కడ ఏ సందర్భంలో ఒంటరిగా ఉన్నా భయాన్ని తోడు రానీయకండి, వచ్చిందంటే ఇంకెవర్నీ తోడు రానీయదు సరికదా, మీలో ఉన్న మీ తోడుని కూడా బయటకు తరిమేస్తుంది. మిమ్మల్ని మీరు మరచిపోయేలా చేస్తుంది. అందుకే అంతకు ముందే మీకు తోడుగా మిమ్మల్ని ఆహ్వానించుకోండి. ఆనందంగా సాగిపొండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 09-03-06 గురు | చించినాడ గీతామందిరం |
| 12 నుండి 16 | అరుణాచలం క్యాంపు |
| 26-03-06 ఆది | పత్తేపురం |
| 30-03-06 గురు | జిన్నూరు |
| 06-04-06 గురు | శ్రీరామనవమి, పాలకోడేరు |
| 09-04-06 ఆది | పిప్పర |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## ఒకటిగా ఉన్నది "నిజం" - రెండుగా ఉన్నది "మాయ"

ఆధారం అంటే ఒక్కటిగా ఉన్న అధిష్ఠానం. ఇది లేనిదే ఈ సృష్టిలో ఏ వస్తువుకు ఉనికి అసాధ్యము. వస్త్రాలకు ఆధారం దూది, కుండకు మట్టి, ఆభరణానికి బంగారం అధిష్ఠానంగా ఉంది. ఈ విశాల విశ్వంలో సర్వ రూపాలు ఒక్కటిగా ఉన్న మహత్తర సత్యం యొక్క వ్యక్త రూపాలే. దేహాత్మ భావన వల్ల మంచి చెడులకు లోబడి అసంఖ్యాక దేహాలతో గడిపి, అనుభవాలను, ఆకాంక్షలను గడించింది ఈ మనస్సు. ఒక్కటిగా ఉన్న ముక్త స్థితిలో ఉండే ఆనందాన్ని పొందాలంటే మనస్సుకు బాహ్య వస్తుమయ ప్రపంచంలో లభ్యమయ్యే చిరు ఆనందాలుకంటే చాలా గొప్పదైన ఆనందం తనలోనే ఉందని తెలియాలి. దాన్ని నిజంగా నమ్మితే ప్రకృతి రాగ-బంధాలను పెంచుకోదు. కుక్క ఎముకను అదేపనిగా కొరుకుతూ ఉంటే రాపిడికి నోరు పగిలి రక్తం వస్తూ ఉంటే ఎముక నుంచి రక్తం వస్తున్నది అని ఎముక ఎక్కడ కనిపించినా పరుగులు తీస్తుంది. అలాగే మనస్సు తనకన్న భిన్నంగా రెండవ వస్తువు ఉందని భ్రమించి విషయ భోగాలవైపుకు పరుగులు తీస్తుంది. నిజానికి సుఖాన్ని ఇచ్చే గుణం వస్తువుల్లో లేదు. ఆక్రియలో మనస్సు ఏకాగ్రత వల్ల మాత్రమే ఆనందం వస్తుంది అని దానికి తెలియదు. సుఖ-దుఃఖాలు అన్ని ప్రతిబింబమైన అహంకారానికి చెంది ఉంటాయి. ఒక్కటిగా ఉన్న పూర్ణత్వమే మన సహజ స్వభావం కాని అహంకారం మూలంగా భ్రమకు లోనై మనలను మనమే దుఃఖితులుగా భావిస్తున్నాము. బాలుడు చందమామ కావాలని గొడవచేస్తే తల్లి ఒక అద్దాన్ని ఇస్తుంది. దానిలో చంద్రుని పట్టుకొన్నట్లు బాలుడు భ్రమపడి సంతోషంతో కొంతసేపు ఆడుకొంటూ పొరపాటున అద్దం జారిపడి విరిగిపోతే చంద్రుడు విరిగిపోయాడని విలపిస్తాడు. సరిగ్గా మన స్థితి అదేరకంగా ఉంది. శరీరం జబ్బుగా ఉంటే నేను జబ్బుగా ఉన్నానని, మనస్సు అశాంతిగా ఉంటే నేను అశాంతిగా ఉన్నానని అంటూ విలపిస్తున్నాము. ఆత్మ ఈ కర్మలతో ఎటువంటి జోక్యం లేకుండా ఒక్కటిగా ఆనందంగా ఉంది. ఒక్కటిగా ఉన్న జ్ఞాని అన్ని రూపాలు తనవిగా చూడటం వల్ల పతనం చెందదు. మనస్సు కోరికా, విచారం, ఆమోదం, క్రోధంలో వశం కాకపోతే ఒక్కటిగా ఉన్న ముక్త స్థితిలో ఉన్నట్లే, గురు సమక్షంలో మన ప్రయత్నం లేకుండానే ఒక్కటిగా ఉండి ఆనందిస్తాము అది గురు వైభవం.

– సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం

జీవితమంతా మీరు కోరుకున్న, ఇష్టపడిన, ప్రేమిస్తున్న వ్యక్తులతోనే గడుస్తుందనే గ్యారంటీ లేదు, చాలా వరకు అది సాధ్యపడదు కూడా. అందుకు పరిస్థితులను మీకు మీరుగా ధైర్యంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలంటే అందరూ ఉన్నపుడూ మిమ్మల్ని మీరు తెలుసుకొని మీకు మీరు తోడుగా ఉండటం అలవాటు చేసుకోవాలి.

## మీకు మీరు పరిచయం కావాలి

మీకెంత మందితో పరిచయాలు ఉన్నాయి అనేది కాదు ముఖ్యం. ముందు మీకు మీరు పరిచయం కావాలి. ఎప్పటికప్పుడు మీ సమాచారం మీ లోపలి మనిషికి (మీ మనసుకు) పరిచయం చేయాలి. ఆత్మ విమర్శ చేసుకోవటానికి కూడా ఇదే ఉత్తమ మార్గం. మీకెన్నో ఆలోచనలు రావచ్చు, అన్నీ మనసులోనుంచి పుట్టవు. వాటి ప్రభావాన్ని మీరు ఖచ్చితంగా అంచనా వేయాలంటే ఒంటరిగా కూర్చుని మీతో మీరు ఆ విషయాలను చర్చించుకోవాలి. మీకు సరిపడే, మేలుచేసే నిర్ణయం తప్పకుండా బయటపడుతుంది.

స్నేహాలు, సంబంధాలు అనేవి ఏవైనా అవసరాలు కాకూడదు, ఆ మనుషులతో కలిసి ఉండటాన్ని కోరుకోవడం ద్వారా ఏర్పడాలి. అప్పడే వాటికి విలువ. మీరు ఖచ్చితంగా మీకు కావలసిన వ్యక్తుల స్నేహాన్ని కోరుకోవాలంటే మీకు మీరు ఖచ్చితంగా తెలిసి ఉండాలి.

మీ చేతిలో చెయ్యి వేసుకొని అలా ఒంటరిగా నడవండి. మీ గురించి మీకు ఎంత సమాచారం వస్తుందో మీకే అర్థమవుతుంది. అదే మీకేం కావాలో కూడా చెబుతుంది. దాని ప్రభావాల్నీ వివరిస్తుంది. ఇది తెలుసుకోవటానికి ప్రపంచమంతా తిరగనక్కరలేదు. ప్రఖ్యాత నిపుణుల్ని కలవనక్కరలేదు.

ప్రయత్నించండి, మీతో మీరుంటే మీకు గొప్ప తోడు దొరికినట్లే మరి.

(సంకలనం : ది॥ 06-02-2006 వార్త దినపత్రిక)

మీకున్న పరిచయాల సంఖ్య కంటే మీకు మీరు పరిచయం కావడం ముఖ్యం. మీకెవరు తోడున్నారు? అనే ప్రశ్నకంటే మీకు మీరు ఎంత వరకు తోడున్నారు అనేది ప్రధానం. మీ జీవితం పట్ల, మీ మేలు కోరేవారి భయంకన్నా, మీకున్న భయమే పెద్ద సమస్య, ఏకాంతంగా గడపటం వేరు, ఒంటరితనంతో బాధపడటం వేరు. మీకు మీరు తోడుగా మీతో మీరుండటమే అన్నింటికీ గొప్ప పరిష్కారం!